
- వివరాలు 8లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం 5 మార్చి 2025



లింగసముద్రంలో అసంపూర్తిగా ఉన్న వసతి గృహ భవనాలు



కలిగిరి : డార్మెటరీ గదిలో ఇంటర్ విద్యార్థినులు



కొండాపురంలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు

ఆంధ్రజ్యోతి విజిట్

కష్టాల్లో కస్తూర్బాలు

- మెనూ అమలులోనూ నిర్లక్ష్యమే
- అదనపు గదుల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో!?
- లక్ష్యానికి తూట్లు పొడిచిన గత వైసీపీ సర్కారు

- సమస్యల నడుమ బాలికల చదువులు
- కాస్మెటిక్స్ లేవు.. అందని దుప్పట్లు

గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల పిల్లల్లో బాలికల నమోదు స్థాయి పెంచడం, బాలికా విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో హాస్టల్ వసతి కల్పిస్తూ ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను (కేజీబీవీ) కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరంభంలో కాస్త ఫర్వాలేదనిపించినా గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అక్కడ నెలకొన్ని తీవ్రదుర్భిక్ష పరిస్థితులపై ఆంధ్రజ్యోతి బృందం ఆ విద్యాలయాలను విజిట్ చేసింది. ఇందులో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మూడేళ్లుగా సబ్బు, నూనె వంటి వస్తువులు కూడా విద్యార్థినులకు అందలేదు. కనీసం దుప్పట్లు కూడా సరఫరా చేయకపోవడంతో ఇన్నాళ్లు చలికి వణికిపోతూ కాలం వెళ్లదీశారు. ఇవన్నీ అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు.

- నెల్లూరు (విద్య)/ కలిగిరి (ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా 12 కేజీబీవీల్లో 3 వేల మంది విద్యార్థినులు చదువుతున్నారు. మౌలిక వసతుల లేమి.. సరిపడా బోధన సిబ్బంది లేకపోవడంతో ఈ విద్యాలయాల లక్ష్యం నీరుగారుతోంది. దీనికితోడు కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేసి బాలికల జూనియర్ కళాశాలలుగా మార్పు చేసినా ఏమాత్రం పురోగతి లేదు. భవనాలు లేవు.. ప్రయోగశాలలు లేవు.. పైగా టీచింగ్ సిబ్బంది నియామకాలు జరగకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న పీజీటీల్లోనూ అభద్రతా భావం నెలకొని ఉందని, పార్ట్‌టైం, ఫుల్‌టైం అంటూ శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికీ జాబ్‌చార్ట్ కూడా రూపొందించకపోవడంతో ఉద్యోగ భద్రత లేక చాలామంది పీజీటీలు ఈ ఏడాది వదిలి వెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెబుతున్నారు. అలాగే నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కంప్యూటర్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రధానంగా అధిక కేజీబీవీల్లో సీసీ కెమెరాలు సరిగా పని చేయకపోవడంతో విద్యార్థినుల భద్రత గాలిలో దీపంలా మారింది.

● కాస్మెటిక్స్ ఏవీ!?

2004లో కేజీబీవీల ఏర్పాటుకు బీజం పడగా 2011 నాటికి అన్ని వసతులతో భవనాలు పూర్తయి పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి 2016 వరకు 5-10 తరగతుల విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.100 చొప్పున నెలవారీగా కాస్మెటిక్ చార్జీలు అందజేసేవారు. ఈ నగదుతోనే బాలికలకు తమకు అవసరమైన సబ్బులు, నూనె, పౌడర్ వంటివి కొనుగోలు చేసుకునేవారు. 2016 నుంచి నగదు ఇవ్వకుండా దువ్వెన, బ్రష్, నూనె, పౌడర్, సబ్బుతో కూడిన కిట్లను ప్రతి మూడు నెలలకోసారి అందజేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రతి మూడు నెలలకోసారి ఇస్తున్న కిట్లను ప్రతి నెలా ఇస్తామని చెప్పిన వైసీపీ పాలకులు మూడేళ్ల నుంచి మంగళం పాడేశారు. దీంతో తమకు అవసరమైన వస్తువులను ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. మరోవైపు దుప్పట్లు కూడా మంజూరు చేయకపోవడంతో ఇన్నాళ్లు చలికి వణికిపోతూ అవస్థలు పడ్డారు. గత మూడేళ్లకుపైగా ట్రంకుపెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు కూడా సరఫరా చేయడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కేజీబీవీలు కష్టాల లోగిళ్లలో కొట్టుమిట్టాడుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలోని పాలకులు, ఉన్నతాధికారులు కస్తూరిబా విద్యాలయాలపై దృష్టి సారించి బాలికా విద్యను పరిరక్షించడంతోపాటు విద్యార్థినులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

● లింగసముద్రం : స్థానిక కేజీబీవీలో 1-10వ తరగతి వరకు 200 మంది, ఇంటర్ 43 మంది ఉన్నారు. వారికి తరగతి, వసతి గృహంలో గదులు చాలక అవస్థలు పడుతున్నారు. పదేళ్ల క్రితం వసతిగృహం కోసం భవనంపై అంతస్తులో నాలుగు గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు మంజూరుకాకపోవడంతో పనులు ఆగిపోయాయి. అలాగే నాడు-నేడు రెండో విడత కింద రూ.90 లక్షలతో ఇంటర్ తరగతి గదులు, వసతి గృహం పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.40 లక్షల విలువైన పనులు జరగ్గా ఆ తర్వాత నిధులు రాకపోవడంతో ఆగిపోయాయి. ఇక విద్యాలయంలో ఉన్న రెండు మంచినీటి బోర్లలో ఒకటి మరమ్మతుకు గురైంది. ఉన్న ఒక్క బోరు మరమ్మతుకు గురైతే తమకు నీటి కష్టాలేనని విద్యార్థినులు ఆవేదన చెందుతున్నారు.

● ఏఎస్ పేట : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆహారం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థినులు సరిగా తినడంలేదు. ఇక్కడ నెలకొన్న సమస్యలు వెలుగులోకి రానీయకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

● ఉదయగిరి : కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆరేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. దుత్తలూరు మండలం నందిపాడు, సీతారామపురంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. నందిపాడు కేజీబీవీలో 260 మంది విద్యార్థినులు ఉన్నారు. 200 మీటర్ల మేర ప్రహరీగోడ నిర్మాణం నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కొండాపురం : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 261 మంది విద్యార్థినులు ఉన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యుత్ కోతల నుంచి ఉపశమనానికి జనరేటర్‌ను ఏర్పాటు చేయాలి. రూ.95లక్షలతో మంజూరైన 8 అదనపు తరగతి గదుల్లో నాలుగింటి నిర్మాణం దాదాపుగా పూర్తయింది. మరో 4 గదుల నిర్మాణం జరగాల్సి ఉంది.

● కలిగిరి : ఇక్కడున్న విద్యాలయంలో తరగతి గదుల కొరత ఉండటంతో ఇంటర్ తరగతులు డార్మెటరీ రూంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుప్రియ తెలిపారు. విద్యార్థినుల స్టైఫండ్ విడుదల కాలేదు. అలాగే ట్రంకు పెట్టెలు, దుప్పట్ల కొరత ఉంది.

● వలేటివారిపాలెం : జమీన్ ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6 నుంచి ఇంటర్ వరకు 250 మంది విద్యార్థినులు ఉన్నారు. దుప్పట్లు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, పరుపులు, ట్రంక్‌పెట్టెలు బాలికలు ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. భద్రత కోసం పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు, పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయలేదు. 12ఏళ్ల కిందట విద్యాలయానికి మంజూరు చేసిన కంప్యూటర్లు చెడిపోవడంతో కంప్యూటర్ విద్య అందడంలేదు. ప్రస్తుతం ఉన్న వంటగదితోపాటు మరో గది అవసరం ఉంది. వంటమనిషి, నైట్ వాచ్‌మన్, వార్డెన్ తదితర సిబ్బంది కొరత ఉంది. నేషనల్‌హైవే రోడ్డు ఎత్తు పెరగడంతో ఆకతాయిలు సులభంగా ప్రహరీ దూకి విద్యాలయంలోకి వచ్చే అవకాశం ఉంది.



వలేటివారిపాలెం : కేజీబీవీలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

రైతన్న పాలిట శనిగ!

- దిగుబడి వచ్చినా ధర పతనం
- క్వింటం రూ.5,500లోపే!
- గిట్టుబాటుకాని 'మద్దతు' ధర.. ఆపై నిబంధనల కొర్రీ
- దళారులకే అమ్ముకుంటున్న కర్షకులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. తుఫాన్ ప్రభావం, అదునులో వర్షాల కారణంగా రబీ సీజన్‌లో సకాలంలో పంటలు సాగు చేయలేకపోయారు. కాస్త ఆలస్యంగా శనగను సాగు చేసిన రైతన్న తెగుళ్ల నుంచి గట్టెక్కి, ఆశాజకంగా దిగుబడులు వచ్చినా ధరలు దిగజారడంతో ఆందోళన నెలకొంది.

● తగ్గిన సాగు విస్తీర్ణం

మూడేళ్లుగా శనగ పంటకు ఆశించిన ధర లేకపోవడంతో ఈ ఏడాది అధికంగా పొగాకు, ఇతరత్రా పంటల వైపు రైతులు మొగ్గుచూపారు. గతేడాది జిల్లాలో 14,858 ఎకరాల్లో శనగ సాగు చేయగా, ఈ ఏడాది 9,530 ఎకరాల్లోనే సాగు చేశారు. ప్రధానంగా పొదలకూరు, చేజర్ల, అనంతసాగరం, ఏఎస్‌పేట, కలిగిరి, వింజమూరు, కొండాపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో సాగు చేశారు. ప్రస్తుతం శనగ పంట నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి.

● దిగజారిన ధర

ఏడాదికేడాది శనగ ధరలు దిగజారుతున్నాయి. 2023లో క్వింటం రూ.4,500, 2024లో స్వల్పంగా పెరిగి రూ.6,200లకు చేరింది. ప్రస్తుతం క్వింటం రూ.5000 నుంచి 5,500 పలుకుతోంది. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర క్వింటం రూ.5,440 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ ఏడాది రూ.5,650 ధర నిర్ణయించినట్లు వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. అయితే, పంట కొనుగోళ్లలో నిబంధనలు పాటిస్తుండడం, నగదు చెల్లింపులు ఆలస్యమవుతుండడం, బహిరంగ మార్కెట్, ప్రభుత్వ మద్దతు ధరకు పెద్ద వ్యత్యాసం లేకపోవడంతో రైతులు దళారులకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచి మార్కెట్ ఫెడ్, రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని శనగలు సాగుచేసిన రైతులు కోరుతున్నారు.



బస్తాల్లోకి శనగలను నింపుతున్న రైతులు

ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లాలో అన్ని మండలాల్లో సాగు చేసిన శనగ పంట దిగుబడులను ఆర్‌ఎస్‌కే, మార్క్‌ఫెడ్‌ల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే రైతుల నుంచి శనగలను కొనుగోలు చేస్తాం.

- సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

15 రోజుల్లో అయ్యవారిపల్లి భూ సమస్యకు పరిష్కారం

వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లిలో రికార్డుల్లేని 6500 ఎకరాల ప్రభుత్వ భూమి సమస్య పరిష్కారానికి 15 రోజుల్లో చర్యలు తీసుకోనున్నట్లు సబ్ కలెక్టరు పేర్కొన్నారు. అయ్యవారిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.118, 4లలో ఎఫ్‌ఎంబీ, ఎఫ్‌ఎల్‌ఆర్‌లకు భారీ వ్యత్యాసం ఉండటం, 6500 ఎకరాల భూమికి హక్కుదారులెవరో తెలీకుండా రికార్డులు ఉండటంతో ఆక్రమణలు జరుగుతున్న వైనంపై ఈ నెల 2న ఆంధ్రజ్యోతిలో 'ఆ భూమి మాది కాదు.. అబ్బే మాదీ కాదు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆమె మాట్లాడారు. ఆ రెండు సర్వే నెంబర్లు రెవెన్యూ ఫారెస్టుగా నమోదు చేసి ఉన్నారని అందువల్ల రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. జాయింట్ సర్వే నిర్వహించి, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.


గర్భకండ్రిక భూ సమస్యలపై గ్రామసభలు

● 7, 8 తేదీల్లో నిర్వహణ : సబ్‌కలెక్టర్

కందుకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న గర్భకండ్రిక భూముల సమస్య పరిష్కారానికి త్వరలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ భూముల సమస్యపై ఇటీవల కందుకూరుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు రైతులు విన్నవించారని, సమస్య పరిష్కారానికి సీసీఎల్‌ఏ నుంచి కూడా ఆదేశాలు వచ్చాయని తెలిపారు. అయితే గర్భకండ్రిక భూముల క్లాసిఫికేషన్ పరిశీలించగా అవి ప్రైవేటు భూములేనని నిర్ధారణ అయిందన్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు మ్యూటేషన్లు జరగకుండా క్రయవిక్రయాలు చేసుకునేందుకు అవకాశం లేకుండా ఉన్న ఈ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా హక్కులు కల్పించేందుకు గతంలోనే నోటిఫికేషన్ జారీచేసి ఉన్నారని గుర్తు చేశారు. సీసీఎల్‌ఏ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు లేనందున తక్షణం ఆ ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు చెప్పారు. కందుకూరు ప్రాంతంలో గర్భకండ్రిక భూములున్న అన్ని గ్రామాల్లో రానున్న శుక్ర, శనివారాల్లో గ్రామసభలు నిర్వహించి, రైతుల వద్ద ఉన్న ఆధారాలు, అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. తదనుగుణంగా క్షేత్రపరిశీలన ద్వారా త్వరలోనే ఆయా రైతులకు సర్వహక్కులు సంక్రమించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- నెరవేరని మంత్రి మనోహర్ హామీ
- రవాణా, హమాలీ చార్జీల కోసం రైతుల ఎదురుచూపు
- రెండేళ్లయినా లెక్క తేల్చని అధికారులు

10 రోజులైంది.. పైసలేవీ!?



'గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు రవాణా ఖర్చులు రూ.1.4 కోట్లు ఇవ్వాలని జేసీ చెప్పారు. సోమవారానికల్లా (24వ తేదీ) రైతుల ఖాతాల్లో ఆ నగదు జమ అయ్యేలా చూస్తా'

- గత నెల 22వ తేదీన సంగంలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు ఇచ్చిన హామీ ఇది.

నెల్లూరు (హరనాథపురం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల క్రితం ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన రవాణా చార్జీల చెల్లింపుల్లో పౌరసరఫరాల సంస్థ తీవ్ర జాప్యం చేస్తోంది. అసలు చార్జీలు చెల్లిస్తారో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కూడా హమాలీ చార్జీల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తోంది. గత నెల 22న జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు రవాణా చార్జీలను వెంటనే చెల్లించాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులను ఆదేశించారు. అయితే, ఇప్పటికి పది రోజులు గడుస్తున్నా అధికారుల్లో చలనం లేదు. కాగా, 2021 -22 ధాన్యం సేకరణ లెక్కలను మాత్రం బయటకు తీస్తున్నారు. అయితే రైతులకు చెల్లించాల్సిన రవాణా చార్జీల వివరాలు అధికారులు వద్ద లేవనేది సమాచారం. ప్రైవేటు రవాణా వారిని కూడా ఆ ఏడాది ధాన్యం సేకరణకు పౌర సరఫరాల సంస్థ వినియోగించినట్లు తెలుస్తోంది. వారికి కూడా సుమారు రూ.3కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మొత్తం రూ.6 కోట్ల వరకు రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంది. కానీ, లెక్కలు కూడా మాయం చేసి వివరాల సేకరణలో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో అవినీతి కుంభకోణం వెలుగులోకి రావడంతో పలువురు సస్పెండైనానా వారిలో మార్పు లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమకు రావాల్సిన రవాణా, హమాలీ చార్జీలను చెల్లించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రీకృత చెల్లింపులు చేస్తాం

2021-22లో ధాన్యం సేకరణకు సంబంధించి రవాణా చార్జీలను రైతులకు చెల్లించాల్సి ఉంది. వారికి కేంద్రీకృత చెల్లింపులు ఉంటాయి. రవాణా చార్జీల కోసం క్లెయిమ్ చేసిన రైతులకు, వారి వివరాలను రిజిస్టర్ చేస్తున్నాం. చెల్లింపుల వివరాల లెక్కలు తయారు చేస్తున్నాం. త్వరలో చెల్లింపులు జరుగును.

- ఓ. అర్జున్‌రావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి గ్రామోత్సవం



సంగం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయానికి నూతనంగా తయారు చేయించిన శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వేమా మల్లికార్జునరావు, నాగరాజకుమారి దంపతులు పంచలోహ నూతన ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఈసందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాల నడుమ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు ధాన్యం (వడ్లు) నైవేద్యంగా సమర్పించారు. బుధవారం సాయంత్రం సంగమేశ్వరాలయంలో వళ్లీదేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ



బహుమతులు అందిస్తున్న ఎస్ఐ

వరికుంటపాడు (ఉదయగిరిరూరల్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మా రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డుతూ ప్రస్తుత సమాజం లో మహిళలు, విద్యార్థినులు చట్టలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నేటి సమాజంలో మహిళల పాత్ర - ఎలా మెలగాలి అనే అంశంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూటు మారిన రేషన్ బియ్యం

- చౌకదుకాణాలకు చేరకుండానే పక్కదారి

కలువాయి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి బ్లాక్ మార్కెట్‌కు అక్రమంగా తరలించే రేషన్ బియ్యం ఇటీవలి కాలంలో రూటు మారింది. స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు చేరకుండానే పక్కదారి పడుతోంది. కలువాయిలో సోమవారం ఒక రేషన్ షాపు నుంచి మరో షాపునకు నిబంధనలకు విరుద్ధంగా బియ్యం ఎండీయూ వాహనంలో తరలించడం, ఈ విషయం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ దృష్టికి పోవడంతో దీనిపై ఆయన విచారణ చేయిస్తానని తెలిపారు.

మండలంలో 13,600 రేషన్ కార్డులు ఉన్నాయి. 41 రేషన్ షాపులు, 9 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా లబ్ధిదారులకు సుమారు 200 టన్నులు (4000 బస్తాలు) బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇందులో పెద్దఎత్తున సుమారు 700 బస్తాలు వరకు దళారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇందుకోసం మండలంలో ఒక నెట్‌వర్క్ నడుస్తోంది. ఇప్పటి వరకు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు కలిసి లబ్ధిదారుల నుంచి కేజీ రూ.10 నుంచి రూ.12 వంతున బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యంను బస్తా (50 కేజీలు) రూ.950 వంతున స్థానిక దళారులకు అమ్ముతారు. వారు వాటిని మండలంలో ఒక కేంద్రానికి తరలించి అక్కడ నుంచి నెలకు ఒకటి లేదా రెండు సార్లు ఇంకో దళారికి లారీలో పంపించడం ఇప్పటి వరకు జరుగుతోంది. అయితే కొనుగోలు చేసిన బియ్యం రహస్యంగా తరలించడం, వాటిని మళ్ళీ లారీలకు లోడ్ చేసి ఇక్కడ నుంచి పంపించడం ఇబ్బందిగా మారడంతో అక్రమార్కులు కొత్త మార్గం ఎంచుకున్నారు. ప్రతి నెలా స్టాక్ పాయింట్



ఎండీయూ వాహనంలో లోడ్ చేసిన రేషన్ బియ్యం

నుంచి పెద్దఎత్తున బియ్యం షాపులకు చేరకుండానే నేరుగా బయటకు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో షాపునకు ఎన్ని బస్తాలు బియ్యం తగ్గించి దించుతారో వాటికి బస్తాకు రూ.950 వంతున దళారులు డీలర్లకు నగదు అందజేస్తారు. తగ్గించి వచ్చిన బియ్యం పంపిణీ సమయంలో లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటారు. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపితే ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

బియ్యం సక్రమంగా చేరుస్తున్నాం

- పౌరసరఫరాల శాఖ రాపూరు గోదాముల డీటీ హరి

స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం చేరకుండానే కొంత పక్కదారి పడుతున్న విషయం పౌరసరఫరాల శాఖ రాపూరు గోదాముల డిప్యూటీ తహసీల్దారు హరి దృష్టికి తీసుకుపోగా మా దగ్గర నుంచి అలా ఏమీ జరగడం లేదన్నారు. వారికి రావాల్సిన బియ్యం అంతా చేర్చి డీలర్లు చేత వేలిముద్రలు తీసుకుంటున్నామని చెప్పారు.

న్యూస్ బాక్స్

ఫిజియోథెరపీపై అవగాహన



ఫిజియోథెరిపీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

సంగం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి మంగళవారం ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఫిజియోథెరిపిస్ట్ డాక్టర్ బి రమేష్ ఫిజియోథెరపీ వల్ల ప్రయోజనాలు, ఎలా చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, ఏపీఎం రవిశంకర్ రెడ్డి, ఎస్ఆర్ఈజీయస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరిత రాయబారులను నియమించాలి



ఎంపీడీవోకి వినతిపత్రం అందచేస్తున్న మర్రిపాడు గ్రామస్థులు

సంగం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణకు తమను హరిత రాయబారులను నియమించాలని ఆ గ్రామానికి చెందిన దళితులు మంగళవారం ఎంపీడీవో షాలెట్‌కు వినతి పత్రం అందచేశారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఆమె వారికి హామీ ఇచ్చారు.

ప్రయోగాత్మక విద్యతో విద్యార్థుల్లో మనోవికాసం



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న మేనేజర్ బితేష్‌కుమార్

అనంతసాగరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మక విద్యతో విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందుతుందని అనంతసాగరం కెనరా బ్యాంక్ మేనేజర్ బితేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక వికాస్ పాఠశాలలో మంగళవారం జరిగిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు చేసిన పలు ప్రయో గాలు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఖాదర్‌వలి, పెంచలప్రసాద్ జేవీవీ నాయకుడు వేము పెంచలయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష్యాలు అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైద్యఆరోగ్య సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను ఈనెలాఖరు నాటికి నూరుశాతం అధిగమించాలని మండల వైద్యాధికారి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆశ, వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలను పూర్తిచేసి తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో సమస్యలు వెంటాడుతున్నాయని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా అఖిల భారత ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో స్థితిగతులపై డిపో మేనేజర్‌ను, కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలీనం అయిన తరువాత ఆర్టీసీ డిపోలను, ఆస్తులను వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని, నిధులను పక్కదారి పట్టించిందన్నారు. ఒక్క కొత్త బస్సు కొన్న దాఖలాలు లేవన్నారు. కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. క్రమేణా ఆర్టీసీలో ఉన్న సమస్యలు, కార్మికుల సమస్యలను పరిష్కరించి సంస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కరీమున్నీసా, ఆర్టీసీ అధికారులు, బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా వైద్యఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యఆరోగ్య సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వైద్యశాలలో కాన్పుల సంఖ్య పెంచడంతోపాటు ప్రతి రోగికి 63 రకాల పరీక్షలు చేయాలని సూచించారు. ఎన్‌సీడీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అయూబ్ అప్సర్, వనజ, సూపర్‌వైజర్లు బీబీజాన్, ఖాజామొహిద్దీన్, ఓంకారయ్య, అరుణకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరిస్తున్న చర్చి సంఘ సభ్యులు

ఉదయగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బర్డిట్ మెమోరియల్ సెంటనరీ బాప్టిస్ట్ (బీఎంసీబీ) చర్చికి సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరుతూ మంగళవారం సంఘ సభ్యు లు తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమెరికన్ బాప్టిస్టు సంస్థ వారు ఉదయగిరిలో చర్చి నిర్మాణం చేసి దానికి అనుబంధంగా పలు సర్వేనెంబర్లలో 40 ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేసిందన్నారు. దానిని కొందరు విక్రయించగా, మరికొందరు విక్రయించి మోసపూరితమైన రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సంఘ సభ్యులమైన తామందరం కలిసి అడ్డుకోగా తమపై కేసులు పెట్టారన్నారు. తాము కూడా వారిపై కేసులు పెట్టగా ఆరునెలల వాదోపవాదనల తరువాత ఉదయగిరి కోర్టులో విచారణ జరిగి తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. అలాగే ఇటీవల మద్రాసు హైకోర్టు 30 ఏళ్లపాటు సుదీర్ఘ వాదనలు విని అమ్ముకున్న వారిపై కేసులు పెట్టి ఎలాంటి విక్రయాలు చెల్లుబాటు కావని గతేడాది డిసెంబరులో తీర్పు ఇచ్చిందన్నారు. ఎవరైనా చర్చి స్థలాలను ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. కావున అధికారులు తగిన చర్యలు తీసుకొని చర్చి ఆస్తులను కాపాడాలని కోరారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లలో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఉదయగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో కార్యాలయ సిబ్బంది, సీఆర్ఎంటీలు బాధ్యతగా విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, సీఆర్ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో సమయపాలన పాటిస్తూ క్లస్టర్లకు సంబంధించిన సమగ్ర సమాచారంతో అందుబాటులో ఉండాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్స్ కిట్స్ నాణ్యతను పరిశీలిస్తూ క్లస్టర్లకు చేర్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గది నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

నీటి వసతి లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ఇబ్బందులు పడుతున్న మహిళలు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్); మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించండి, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టండి అంటూ ఊదరగొట్టే అధికారులు వాటి అమలులో మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో రద్దీగా ఉండే మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని సంఘమిత్ర కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి నప్పటికీ వినియోగించే అవకాశం లేకుండా పోయింది. కేవలం నీటి వసతి కల్పించక పోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తు న్నాయి. దీంతో సమావేశాలు, ఇతర పనులపై కార్యాలయాలకు వెళ్లిన పొదుపు మహిళలు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సోమశిలలో 57.980 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 57.980 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షి ణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రహదారికి ఇరువైపులా పేడదిబ్బలు

- దుర్గంధంతో ప్రజల అవస్థలు



రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి పేడదిబ్బలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం అటుగా ప్రయాణాలు సాగించే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమీపంలోనే రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నప్పటికీ వినియోగంలోకి తీసుకొచ్చే నాథులే కరువయ్యారు. దీంతో ఆ రహదారి మీదుగా ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణీకులు ఎక్కడ రోగాలపాలు కావాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న పేడదిబ్బలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తకుండీలు ఏర్పాటు చేయండి

- అధికారులకు గ్రామస్థుల మొర



చెత్తకుండీలు లేక రోడ్డుపక్కన వేసిన చెత్తాచెదారం

వింజమూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన కూడళ్లలో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు. ముఖ్యంగా చెత్తకుండీలు లేనందువలన చెత్తను రోడ్డు మీద వేసి ఉంచడం వలన దోమలు, పందుల బెడద ఎక్కువగా ఉందని అలాగే పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని వీటి వలన అనారోగ్యం పాలవుతున్నట్లు పట్టణ ప్రజలు తెలిపారు. పంచాయతీవారు చెత్తకుండీలు ఏర్పాటు చేస్తే చెత్తను ఆ కుండీల్లో వేస్తామని వారు తెలిపారు. వెంటనే ఏర్పాటు చేయాలని పట్టణ పరిధిలో కోరుతున్నారు.

ధ్రువీకరణ పత్రాలు త్వరగా సమర్పించాలి

సీతారామపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని గ్రామస్థులు ఇటీవల ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద నిరుపేదల పక్కాగృహాల కోసం 803 మంది దరఖాస్తు చేసుకున్నారని హౌసింగ్ ఏఈ కరిముల్లా తెలిపారు. మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ పత్రం, ఓసిలైతే ఆదాయ ధ్రువీకరణ, పొజిషన్ పత్రాలు మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో రెండు రోజుల్లో అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలానికి హద్దులు చూపాలి

ఉదయగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట గ్రామంలో ఉన్న ముస్లిం శ్మశాన స్థలానికి హద్దులు చూపాలని పలువురు ముస్లింలు మంగళవారం తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెద్దల కాలం నుంచి బస్టాండ్ సెంటర్‌లోని దర్గా స్థల ఆవరణలో తమ కుటుంబాల్లో చనిపోయిన వారిని ఖననం చేస్తున్నామని, ప్రస్తుతం ఆ స్థలం ఆక్రమణకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నామని, హద్దులు చూపాలని కోరారు. స్పందించిన తహసీల్దారు సిబ్బందిని పంపి పరిశీలన చేసి న్యాయం చేస్తామన్నారు.

బిల్లులు ఇప్పించండయ్యా..



ప్రధాన వీధిలో వేసిన సిమెంటు రోడ్డు (ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇంత వరకు తనకు నగదు అందజేయలేదని తూర్పుబోయమడగల గ్రామానికి చెందిన తోడిందల వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2018లో టీడీపీకి చెందిన తాను జన్మభూమి కమిటీ తీర్మానం మేరకు సుమారు రూ. 6లక్షల వ్యయంతో ప్రధాన వీధితో పాటు బీసీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం 2021లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులకుగాను కోర్టు ఆదేశాలతో కొంతమేర నగదును జమ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా తనకు సంబంధించిన రూ. 2.53లక్షల నిధులను సైతం గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. అప్పటి నుంచి కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ తనగోడు పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేకుంటే కోర్టును ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు.

C.R.I.M.E N.E.W.S

చౌదరిపాలెంలో పొగాకు బ్యారెన్ దగ్ధం

- రూ.6లక్షల ఆస్తి నష్టం



బ్యారెన్‌లో వ్యాపించిన మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చౌదరిపాలెం చిడిపోతు వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారెన్ మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బ్యారెన్ సామగ్రితో పాటు బ్యారెన్‌లో పేర్చిన పొగాకు కాలిబూడిద అయ్యింది. విషయం తెలిసిన అగ్నిమాపక కేంద్రం అధికారి రామసిద్దార్థ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడి నుండి వివరాలు తెలుసుకున్నాడు. ప్రమాదంలో రూ.6 లక్షల నష్టం జరిగినట్లు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు.

భర్తపై దాడి కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనలో వేదాయపాలెం పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు, నెల్లూరు నగరంలోని ఉమారెడ్డిగుంటకు చెందిన గాయత్రి, బాలరాజు దంపతులు. వారికి ఓ పాప. భర్త ప్రవర్తనతో విసుగు చెందిన గాయత్రి తన కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బాలరాజు వేరే మహిళతో సన్నిహితంగా ఉంటుండటంతో భార్య నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆయన సోమవారం రాత్రి ఆమెపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన అత్తమామలు, వదినపై కూడా దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు కుటుంబసభ్యులతో కలిసి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలం వివాదం.. కత్తితో దాడి

ఇందుకూరుపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చట్టేవారి కండ్రిగలో పొలం వివాదం నేపథ్యంలో నెట్రంబాక వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన నెట్రంబాక శ్రీనివాసులు సోమవారం మొద్దుకత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు... గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వే విషయంలో వీరిరువురి మధ్య వివాదం జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవించిన నెట్రంబాక శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుపై మొద్దుకత్తితో దాడి చేసి పరారయ్యాడు. చెవి మధ్య భాగంలో తెగిపోయిన క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆడుకుంటూ తప్పిపోయిన బాలిక

- గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



తప్పిపోయిన చిన్నారిని తీసుకువస్తున్న చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఏటో వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుపెట్టుకుంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలికను గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ముంగమూరువీధిలో శంకర్‌సింగ్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కనకమహల్ సెంటర్‌లో పవర్‌టూల్స్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుమార్తె మాధవిసింగ్ (3) మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటివద్ద ఆడుకుంటూ తప్పిపోయింది. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విషయాన్ని ఎస్పీ కృష్ణకాంత్‌కు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారంగా చిన్నారి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కాపువీధిలో చిన్నారి ఏడుస్తూ ఉండగా, వినోద్‌కుమార్ అనే వ్యక్తి చేరదీశాడు. అదే సమయంలో చిన్నబజారు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా వారికి చిన్నారి గురించి తెలియజేశారు. వారు చిన్నారిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే కుమార్తెను అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

కావలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూ రు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంకు చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ గోపి నరశింహ మూర్తి తీవ్ర గాయపడ్డారు. తన ఐషర్ లారీలో అ మలాపురం నుంచి చెన్నైకు అరటి కా యల లోడుతో బయలుదేరాడు. మా ర్గమధ్యలోని ముసునూరు సమీపంలో మద్యం తాగిన లారీ డ్రైవర్ ఒక్కసారిగా లారీని రోడ్డుపై ఆ పాడు. వెనుకనే వస్తున్న ఐషర్ లారీ ముందు ఆగిన లారీని ఢీకొంది. విషయం తెలిసిన హైవే మొబైల్ సిబ్బంది నరశింహ మూర్తిని అతికష్టం మీద బయటకు తీసి కావలి ఏరియా వైద్యశాలకు తర లించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో రూరల్ పోలీసుల పర్యవేక్షణలో నెల్లూరు తరలించారు. కుటుంబసభ్యులు వచ్చి అతన్ని కాకినాడకు తీసుకెళ్లారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రిలయన్స్ భూముల్లో వన్యప్రాణులు

ముత్తుకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నంలోని రిలయన్స్ భూముల్లో వన్యప్రాణులు ఉన్నాయన్న సమాచారంతో మంగళవారం కలకలం రేగింది. ఈ భూముల్లో విపరీతంగా పెరిగిన మొక్కలను తొలగించేందుకు రిలయన్స్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం అడవిగా పెరిగిన చెట్ల మధ్య నుంచి చుక్కల దుప్పులు బయటకు వచ్చాయని, కొందరు వాటిని వేటాడారని ప్రచారం జరిగింది. వన్యప్రాణుల సంచారం సమాచారం తెలుసుకున్న జిల్లా అటవీ శాఖ అధికారులు రిలయన్స్ భూముల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రిలయన్స్ భూముల్లో పరిశీలన చేపట్టామన్నారు. కొన్ని చుక్కల దుప్పులు, అడవి పందులు కనిపించాయని స్థానికులు చెప్పారన్నారు. అయితే క్లియరెన్స్ కోసం చెట్లను తొలగించినందున వన్యప్రాణులు పరిసర ఆవాస ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిలయన్స్ అధికారులకు పలుసూచనలు చేశామన్నారు. యంత్రాలతో పనులు చేస్తున్నందు వల్ల వన్యప్రాణులు పాదముద్రలు కనిపించ లేదన్నారు. పరిసర ప్రాంతాల్లోని పొలాలు, చెట్ల మధ్య వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు, రేపు వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

లింగసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు బుధ, గురువారాల్లో వ్యవసాయానికి ఇచ్చే 9గంటల విద్యుత్ సరఫరాలో రెండురోజులు అంతరాయం కలుగుతుందని మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ షేక్ ఫిరోజ్ తెలిపారు. కందుకూరులోని 220కేవీకే సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులతో జరుగుతున్నందున ఉదయం 9గంటల పాటు ఇచ్చే విద్యుత్‌ను రెండు విడతలుగా సరఫరా చేస్తామన్నారు. అందులో పగలు 5గంటలు, మిగిలిన 4గంటలు రాత్రి ఇస్తామన్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం

● రెడ్‌క్రాస్ సెంటర్ నిర్వహణాధికారి రమ్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రమ్య

కావలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిబాధితులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణాధికారి రమ్య తెలిపారు. వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశాదినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన లోపం ఇది అని చెప్పారు. ఈ వ్యాధి ఉన్న పిల్లలకు బోన్మారో నుంచి రక్తం ఉత్పత్తి కాదని వారి ప్రాణాలు కాపాడాలంటే తరచూ రక్తం ఎక్కించాలన్నారు. సామాజిక ఆరోగ్య అధికారులు, కార్యకర్తలు తమ పరిధిలో రక్త హీనత ఉన్న పిల్లలను కనిపెట్టి రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇస్తే వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ప్రతినెలా రక్తం ఎక్కించటంతో పాటు బలవర్ధక ఆహారం ఉచితంగా అందజేస్తామన్నారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తలసేమియా ఆసుపత్రి కన్వీనర్ హరినారపరెడ్డి, సభ్యులు కల్లయ్య, అర్బన్‌హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు మేఘనాద్, ఫరూక్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి చేయూత


నిత్యావసరాలు వితరణ అందిస్తున్న ప్రసాదరావు తదితరులు

కావలి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి విశ్రాంత అధ్యాపకుడు మంగళవారం నిత్యావసర సరుకులు వితరణ అందించారు. పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలోని వడ్డిపాలెం కనకదుర్గా అమ్మవారి ఆలయం పక్కన ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న విశ్రాంత అధ్యాపకుడు ప్రసాదరావు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అజిత్‌బాబు, సురేంద్ర, ఘనీబాష తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలపై అవగాహన

లింగసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణిలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆశావర్కర్లకు సలహాలు ఇవ్వాలని మండల వైద్యాధికారి రమేష్ ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆశా డేలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఇంటింటికీ జరుగుతున్న క్యాన్సర్ సర్వేను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. రొటీన్ ఇమ్యూనైజేషన్ యాక్షన్ ప్లాన్‌ను రెండురోజుల్లో పూర్తి చేసి ఇవ్వాలన్నారు. హైరిస్క్ గర్భవతిని ముందుగా గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు అనూరాధ, సీహెచ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కుమారి ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పనిఒత్తిడిలో అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవద్దు


అవగాహన కల్పిస్తున్న రమేష్

కలిగిరి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడితో అనారోగ్యాన్ని కొని తెచ్చుకోకూడదని నిజాం ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన ఫిజియో థెరపిస్ట్ రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విధుల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, చిన్నపాటి అనారోగ్య సమస్యలను ఎలా జయించాలి అనే విధానంపై సూచనలిచ్చారు. ఉరుకుల పరుగులతో విధులు నిర్వహించాలంటే ఏకాగ్రత అవసరమన్నారు. అనంతరం హీట్ థెరపీ పరికాల విధానానికి సంబంధించి మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు పాల్గొన్నారు.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

● అధికారుల ఆర్భాటం తప్ప పట్టించుకునే వారేరీ ?

● ఆందోళనలో అన్నదాతలు


ఆర్బీకేలో ఉన్న తేమ శాతం కొలిచే పరికరాలు


వరి కోస్తున్న వరికోత మిషన్

బిట్రగుంట, మార్చి 4(ఆంధ్ర జ్యోతి):బోగోలు మండలంలో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 15,500ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. అందులో ఇప్పటికే సుమారు 7వేల ఎకరాల వరకు వరి కోతలు ముగిశాయి. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల జాబితా విడుదల చేసి నాలురోజులు అవుతుంది. ఇప్పటివరకు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో తక్కువ ధరకైనా రైతులు ధాన్యాని దళారులకు అమ్ముకుంటున్నారు. అధిక వర్షాలతో రైతులు అనుకున్నంతగా పంట దిగుబడి రాకపోవడంతో పాటు ధాన్యం ధర పూర్తిగా పడిపోయిందని అన్నదాతలు వాపోతున్నారు.

పడమర పల్లెల్లో ముగిసిన కోతలు

మండలంలోని పడమర పల్లెలో దాదాపుగా వరి కోతలు ముగిశాయి. తూర్పు ప్రాంతంలో ముందుగా వేసిన పంటలు దాదాపు కోతలు జరుగుతున్నాయి. వర్షాలకు వెనుక చిక్కి వేసిన వరి పంటలు 3వేల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు రైతులు చర్చించు కుంటున్నారు. రెండు రోజుల్లోనే 5వేల ఎకరాలకు పైగా వరి కోతలు జరుగుతాయని రైతుల అంచనా వేస్తున్నారు. పంటలు పూర్తిగా కోతలు జరిగిన అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎవరి కోసం ప్రారంభిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నిమ్మకు నీరెక్కినట్లు అధికారులు వ్యవహరిస్తుంటే నేతలకు రైతుల గోడు పట్టటం లేదన్న మాటలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాంభించకపోతే చిన్నకారు రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతు బాలచంద్ర తెలిపారు.

తేమశాతం కొలిచే మిషన్లు సిద్ధం

ధాన్యం కొనుగోలు ప్రాంభించేందుకు తేమ శాతం కొలిచే మిషన్లను సిద్ధం చేశాం. వాటిలో ఐదు స్వల్ప మరమ్మతులకు చేయాల్సి ఉంది. మూడు మిషన్లు మాత్రం పని చేస్తున్నాయి.

- విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి, బిట్రగుంట

సచివాలయాల ప్రారంభం ఎప్పుడో...?

● అద్దె భవనాల్లో సిబ్బంది విధుల నిర్వహణ



ప్రారంభానికి నోచుకోని అంకభూపాలపురం సచివాలయం

వలేటివారిపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక భూపాలపురం, అయ్యవారిపల్లె గ్రామాల్లోని సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయి రెండేళ్లయినా నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ సమస్యతో సచివాలయ సిబ్బంది అద్దె గదుల్లో అరకొర అసౌకర్యాల మధ్య కాలం వెల్ల దీస్తున్నారు. ఇరుకు గదుల్లో కంప్యూటర్లు తదితర సామగ్రి పెట్టుకునేందుకు వీలు లేకుండా పోయింది. అంకభూపాలపురం పాత పంచాయతీ భవనంలో ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో సుమారు రూ.90లక్షలతో సచివాలయ భవనాలను నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయి. రెండేళ్ల నుంచి ప్రైవేట్ భవనానికి ప్రభుత్వం అద్దె చెల్లిస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఈ సచివాలయ భవనాలను ప్రారంభించాలని సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు కోరుతున్నారు.

ఆ వీఆర్వో విధులకు రాడు.. సెలవు పెట్టడు!

● అధికారులతో సహా ఎవరి ఫోనూ ఎత్తడు!


కావలి పట్టణంలోని 21వ సచివాలయ భవనం

కావలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డులోని 21వ సచివాలయ వీఆర్వో మల్లికార్జున విధి నిర్వహణ ఎవరికీ అంతు పట్టడం లేదు. ఆయన విధులకు సక్రమంగా రాడు.. అలాగని సెలవు పెట్టడు.. ఎక్కడున్నాడు.. ఎప్పుడు వస్తాడో తెలుసుకుందామంటే ఫోన్ లిఫ్ట్ చేయడు. చేసేదిలేక 21వ సచివాలయ పరిధిలోని ప్రజలు పలు సర్టిఫికెట్ల కోసం సచివాలయానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను కలిస్తే ఆయన మా ఫోన్ కూడా ఎత్తటం లేదని, అందుకే ఆయనపై చర్యలు తీసుకునేందుకు కూడా మాకు అవకాశం లేదని చెపుతున్నారు.

సచావాలయాలకు ముందు..

● పట్టణంలోని సచివాలయాలు పెట్టక ముందు ఐదారుగురు వీర్వోలుండగా వారు ఎప్పుడూ తహసీల్దార్ కార్యాలయంలో ఎవరోఒకరు ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం 28సచివాలయాలుండగా ప్రతి సచివాలయానికి ఒకరు చొప్పున 28 మంది వీఆర్వోలు ఉన్నారు. వారిలో కొందరు సచివాల యాల సమయంలో నియామక మైన వారు కాగా మగిలిన వారు అంత కు మునుపు తహసీల్దార్ కార్యాల యాల పరిధిలో పనిచేసే వారు. తహసీల్దార్ కార్యాల యంలో పనిచేసే వారు తహసీల్దార్ల పర్యవేక్షణలో ఉంటు న్నందున వారు సక్రమంగా సచివాలయాలకు రాకపోవటంతో పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాయాలలో పస నిచేసే వారందరు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్డీవోకు ఫిర్యాదు చేశాం

అల్లూరు నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అతను 10రోజులుగా కన్పించడం లేద న్నారు. ఈ మేరకు ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు.

● బి.శ్రావణ్‌కుమార్, మండల తహసీల్దారు కావలి

విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు


విద్యుత్ స్తంభంపై మంటలు ఆర్పేందుకు నీరు వదులుతున్న ఫైర్ సిబ్బంది

కావలి, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌లో మంగళవారం విద్యుత్ స్థంభానికి విచ్చలవిడిగా కట్టిన కేబుల్ వైర్లుకు మంటలు అలుముకుని కేబుల్ వైర్లు కాలిపోయాయి. ఈ విషయాన్ని ఆ ప్రాంతంలో ఇంటికి వెళ్లుతున్న ఒక విశ్రాంత విద్యుత్ ఉద్యోగి గుర్తించి వెంటనే విద్యుత్ ఏఈ వసంతరావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్‌స్టేషన్ ఎస్ఐ తోపాటు వారి సిబ్బందితో వచ్చి వచ్చి మంటలను ఆర్పారు. స్తంభం కింద ఉన్న చెత్తను తగులపెట్టడానికి ఎవరో నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చిం చుకున్నారు. పట్టణంలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు సిబ్బంది ఎక్కేందుకు కూడా వీలు లేకుండా కేబుల్ వైర్లు ఎవరి ఇష్టానుసారం వారు కట్టి ఉన్నారని అత్యవసర సమయంలో స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేయాలంటే ఇబ్బందిగా ఉందని ఏఈ వసంతరావు తెలిపారు.

ఎస్సీ కాలనీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

● సమస్య పరిష్కారానికి సబ్ కలెక్టరుకు వినతి


సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న నూకవరం ఎస్సీకాలనీ వాసులు

కందుకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం నూకవరం ఎస్సీ కాలనీకి 167బీ జాతీయ రహదారి నుంచి ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టకుండా రైతులు అడ్డగించటంతో మాకు న్యాయం చేయాలని కాలనీవాసులు మంగళవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జాతీయ రహదారిగా విస్తరణ జరిగినా కందుకూరు - పామూరు రోడ్డు ఆర్ అండ్‌బీ రోడ్డుగా ఉన్నప్పటినుంచి ఈ రహదారి నుంచి నూకవరం ఎస్సీ కాలనీకి లింకురోడ్డు ఉంది. ప్రస్తుతం ఆ రహదారిని అభివృద్ధి చేసి అప్రోచ్ నిర్మించేందుకు ఎన్‌హెచ్ అధికారులు ప్రయత్నించగా ఇంటూరి చెంచమ్మ, ఆమె కుమారుడు లక్ష్మీనరసింహ్మంలు అడ్డగించి ఇది మా పట్టాభూమి అని ఇక్కడ రోడ్డు వేయటానికి లేదని పనులను నిలిపివేయించారని వారు వినతిలో పేర్కొన్నారు. ఎంతోకాలంగా రోడ్డు ఉన్నది కదా అని కాలనీవాసులు ప్రశ్నించినా వారు ససేమిరా అని పనులను అడ్డగించటంతో వారంతా సబ్ కలెక్టరును కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బుధవారం సర్వే నిర్వహించి తగుచర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టరు వారికి హామీ ఇవ్వడంతో వారు తిరిగి వెళ్లారు. సబ్ కలెక్టరును కలిసిన వారిలో బద్ధిపూడి శిఖామణి, నరసింహ్మం, ఏసేబు, ఆనందరావు, ఇసాక్, శిరోమణి, సుధాకర్ తదితరులున్నారు.

శిథిల భవనాలతో ప్రమాదం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్, మాలకొండ, పెద అమ్మపాలెం, గరుకుపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లోని ఎంపీపీ స్కూల్ భవనాలు శిథిలావస్థలకు చేరి కూలే దశలో ఉన్నాయి. వీటితో విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నిసార్లు విద్యాధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.


వలేటివారిపాలెంలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్ భవనం


గాంధీనగర్‌లోని ఎంపీపీ స్కూల్ భవనం

జీవో నెంబరు 30ని సద్వినియోగం చేసుకోండి

● సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్న వారికి 150 గజాల వరకు ఉచితంగా, ఆపై విస్తీర్ణం ఉంటే నామమాత్రపు విలువ వసూలు చేసి క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీఓ నెంబర్ 30 విడుదల చేసిందని, అర్హత కలిగిన ప్రతిఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ కోరారు. అయితే ఆక్రమిత నిర్మాణాలు చేసిన వారు ఆ స్థలంలో 2019కి ముందు నుంచి నివసిస్తున్నట్లు ఆధారాలు ఉండాలన్నారు. కరెంటు కనెక్షన్, నీటి కనెక్షన్, ఇంటిపన్ను లాంటి ఏ ఆధారం ఉన్నా క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందన్నారు. 150 గజాలకు మించిన స్థలంలో నిర్మాణం చేసుకుని ఉంటే ఎంత విస్తీర్ణంకు ఎంత చెల్లించాల్సి ఉంటుందనే వివరాలన్నీ సంబంధిత వీఆర్‌ఓల వద్ద అందుబాటులో ఉన్నాయని, మీ గ్రామ సచివాలయంలో పరిశీలన చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. రోడ్లు, డొంకలు, వాగులు, కుంటలు, చెరువులకు సంబంధించిన భూముల్లో అక్రమిత నిర్మాణాలు చేసిఉంటే క్రమబద్ధీకరించటం సాధ్యంకాదన్నారు. అభ్యంతరంలేని ప్రభుత్వభూముల్లో ఉన్న నిర్మాణాలన్నింటినీ క్రమబద్ధీకరించటం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రతిభా విద్యార్థులకు ఎన్ఆర్ఐ ప్రోత్సాహకం


ప్రతిభా విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎన్ఆర్ఐ పార్థసారథి

లింగసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లింగసముద్రంకు చెందిన పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కదిరి పార్థసారథి తెలిపారు. మంగళవారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో నీలకంఠశాస్త్రి మెమోరియల్ తరపున ప్రతిభ విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేసి మాట్లాడారు. గత 25ఏళ్లుగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయులు అభినందించారు. హైస్కూల్‌లోని 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.39వేలు, 10వ తరగతిలో ప్రథమ స్థానం పొందిన కిషోర్‌కు రూ.7500లు, ద్వితీయస్థానం నవ్యశ్రీకి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యప్రకాశరావు, చైర్మన్ వెంకట రమేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

● కావలి ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ


రీసర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

జలదంకి, మార్చి4 (ఆంధ్రజ్యోతి):వరిసాగు చేసిన రైతులు మద్దతు ధర వచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కావలి ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. మంగళవారం జలదంకిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం తేమశాతంను యంత్రంతో పరిశీలించారు. బహిరంగ మార్కెటులో మద్ధతు ధర కంటే తక్కువ ధర ఉంటే అమ్ముకోవచ్చన్నారు. అనంతరం ఆర్డీవో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రీసర్వే జరుగుతున్న చామదల గ్రామంపై సర్వే సిబ్బందితో సమీక్ష చేపట్టారు. రీసర్వే పకడ్బందీగా లోటుపాట్లు లేకుండా భూ యజమానులు మెచ్చేలా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఎంతశాతం రీసర్వే పూర్తి చేశారని సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలలో ఆర్డీవో వెంట తహసీల్దార్ ప్రమీల, వ్యవసాయ అధికారిణి శైలజ, సర్వేయర్ శోభన్ తదితరులు ఉన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి


కొండాపురం: చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

కావలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసి ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకరావాలని ఎమ్పీడీవో శ్రీదేవి తెలిపారు. మంగళవారం మన్నంగిదిన్నెలో చెత్త సంపద తయారీపై గుడ్లూరు మండల పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులతో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శి గీత, హరిత రాయబారులు, తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త సేకరణపై అన్ని పంచాయతీలకు చెందిన గ్రీన్ అంబాసిడర్లకు మంగళవారం ఈవోపీఆర్‌డీ ఎమ్.వి.నారాయణరావు గొట్టిగుండాల చెత్త సంపద తయారీ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఇళ్ల నుండి చెత్త సేకరిచే విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చెత్తను సేకరించడంతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు సంపదను రాబట్టే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

క్యూరింగ్, గ్రేడింగ్ సమయాల్లో మెలకువలు పాటించాలి

● వేలం కేంద్రం నిర్వాహణాధికారి చంద్రశేఖర్


మాట్లాడుతున్న చంద్రశేఖర్

వలేటివారిపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్ సమయాల్లో రైతులు మెళకువలు పాటించాలని కందుకూరు 27వ వేలం కేంద్ర నిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. పొగాకు క్షేత్ర దినోత్సవం సందర్భంగా శాఖవరంలో మంగళవారం నిర్వహించిన పొగాకు రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడుగు ఆకులను వదిలేసి పక్వానికి వచ్చిన ఆకులనే రెలపాలని తెలిపారు. ఆకులు అల్లిక సమయం లో ఆకులను నేలమీద వేయకుండా టార్పాలిన్లపై వేసి అల్లాలని తెలిపారు. గ్రేడింగ్ సమయంలో పొగాకులో అన్యపదార్థాలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ సంస్థ ప్రతినిధి వెంకటేశ్వరరావు, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పోషకాలుండే ఆహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ సునీత తెలిపారు. జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కళవళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కుల, మత, లింగ వయసుతో సంబంధం లేకుండా విటమిన్లు, ఖనిజాల ప్రొటీన్లు, కొవ్వులు, నీరు, కార్బొహైడ్రేట్ శరీరానికి అవసరం అన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శైలజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు గోవిందమ్మ, విజయమ్మ, మల్లిక సుజాత పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం


వాహనాల రాకపోకలకు సిమెంట్ కాంక్రీట్ వేయకుండా నిర్మించిన డ్రైనేజీ

అల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తుమోపూరు గిరిజన కాలనీలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుంది. గతంలో ఒకసారి సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టారు. గృహాలకు రోడ్లుకు దాదాపు ఒకటిన్నర అడుగులు ఎత్తు నిర్మించడంతో గృహాలు గుంతల్లోకెళ్లి పోయినట్టు మారిపోయాయి. అదే కాకుండా సిమెంటు రోడ్ల నిర్మించే క్రమంలో సైడ్ డ్రెయినేజీపైన ఎలాంటి బండలు, కాంక్రీట్ నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీవాసులు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలపై సిమెంటు కాంక్రీట్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గరుడ గమనా

గోవిందా..!!

● వైభవంగా రంగనాథుడికి గరుడసేవ



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ శుద్ధ పంచమి సందర్భంగా మంగళవారం రాత్రి నగరంలోని రంగనాయకులపేటలో తల్పగిరి రంగనాథస్వామికి గరుడసేవ, పేట ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణలు, మంగళవాయిద్యాలతో స్వామి పేటలో ఊరేగారు. తమ చెంతకు వచ్చిన స్వామికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, ధర్మకర్తలు, తదితరులు పర్యవేక్షించారు.

రైల్వేస్టేషన్లలో సమస్యలకు పరిష్కారం

● ఎంపీ వీపీఆర్ లేఖకు స్పందించిన రైల్వే జీఎం

నెల్లూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాసిన లేఖకు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్ స్పందించారు. సత్వరం సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు రైల్వేస్టేషన్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. కావలి రైల్వే స్టేషన్ పరిధిలో చెత్త తరలింపు, వర్షాకాలంలో రూఫ్ లీకేజీలు, స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి బెంచీలు లేకపోవడాన్ని ఎంపీ లేఖ ద్వారా దక్షిణ మధ్య రైల్వే జీఎం దృష్టికి తీసుకొచ్చారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నత్తనడక సాగడం, స్టేషన్‌లో అపరిశుభ్ర వాతావరణం, సరైన మరుగుదొడ్ల వసతి లేకపోవడం, మనుబోలు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వసతుల కల్పనపై కూడా జీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ లేఖపై స్పందించిన జీఎం ఆయా రైల్వే స్టేషన్లలో యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీకి తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

చంద్రశేఖరునికి చల్లగా..

● మూలస్థానేశ్వరుడికి వైభవంగా దవనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. సాయంత్రం మూలవర్లకు పూలంగిసేవ, విశేష పూజలు, కుంభహారతుల అనంతరం భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడికి వైభవంగా దవనోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పులిమి మల్లికార్జున్‌రెడ్డి, శిల్పారెడ్డి వ్యవహరించారు. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. అలాగే మూలాపేట నీలకంఠేశ్వర ఆలయంలో ఉదయం విశేష పూజలు, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం కుంభహారతులు, రాత్రి దవనోత్సవం జరిగాయి.



పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు

● జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గుర్రప్ప

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) రికార్డుల కంప్యూటరీకరణ జరుగుతోందని, పూర్తికాగానే రైతులకు ఆన్‌లైన్‌లో నగదు లావాదేవీల సేవలందిస్తామని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి బీ గుర్రప్ప పేర్కొన్నారు. మంగళవారం తొలివిడతగా కంప్యూటరీకరణ పనులు పూర్తి చేసుకున్న మండలంలోని నందిపాడు సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీలోని ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు, లావాదేవీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 78 పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. అందులో నాలుగు సొసైటీలో కంప్యూటరీకరణ పనులు పూర్తి కాగా, నందిపాడు సొసైటీలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించామన్నారు. మిగిలిన పీఏసీఎస్‌లలో కూడా కంప్యూటరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈసందర్భంగా రైతుకు ఆన్‌లైన్ రశీదును అందజేయడంతోపాటు సన్మానించారు. అనంతరం జాతీయ కో-ఆపరేటివ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, సీసీవో నల్లబోతుల శ్రీనివాసులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతుకు ఆన్‌లైన్ రశీదు అందజేస్తున్న గుర్రప్ప

వీఎస్‌యూలో జాబ్‌మేళా

● 33 మందికి ఉద్యోగ అవకాశం

వెంకటాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్‌లతో కలిసి వర్సిటీ నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. ప్రముఖ సంస్థలు, కంపెనీల ప్రతినిధులు విచ్చేసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 69 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 33 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ జే విజేత, పీ జనార్దన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఏ జేసయ్య, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పరిశోధనలకు సహకరించండి

● కేంద్ర భూవిజ్ఞాన కార్యదర్శితో వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు భేటీ

వెంకటాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మంగళవారం ఢిల్లీలో భారత ప్రభుత్వ భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ అకడమిక్, పరిశోధన, ఇన్నోవేషన్, భూవిజ్ఞాన రంగంలో సంయుక్త పరిశోధనలకు ప్రాధాన్యతలపై చర్చించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులకు మరింత పరిశోధనా అవకాశాలను కల్పించేందుకు భూవిజ్ఞాన శాఖ సహకారాన్ని కోరినట్లు తెలిపారు. వీఎస్‌యూకి కావాల్సిన సహాయ, సహకారాలను అందించేందుకు భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్ సానుకూలంగా స్పందించారని, భవిష్యత్తులో భూవిజ్ఞాన, సముద్ర అధ్యయన రంగాలలో వీఎస్‌యూతో భాగస్వామ్యమై పలు ప్రాజెక్టులను చేపట్టాలని సూచించామన్నారు.



భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి రవిచంద్రన్‌తో వీసీ

ఫోర్జరీ సంతకాలతో బురిడీ

● ఆత్మకూరులో పోస్టల్ ఏజెంట్ బాగోతం
● ఖాతాదారుల సొమ్ము రూ.31 లక్షల స్వాహా
● ఆలస్యంగా వెలుగులోకి..
● బాధితుల లబోదిబో

ఆత్మకూరు, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పోస్టాఫీసులో డిపాజిట్ కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్న షేక్ ఇమామ్ ఖాసిమ్ ఖాతాదారుల ఫోర్జరీ సంతకాలతో సుమారు రూ.31 లక్షలు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి వివరాల మేరకు.. పట్టణంలోని జేఆర్ పేటకు చెందిన దగుమాటి నారాయణరెడ్డి, నారాయణమ్మ దంపతులతోపాటు సుజాత, రాజమ్మ, స్వాతి, శ్వేత తదితరుల సభ్యుల పేర్లతో పోస్టల్ ఏజెంట్ ఇమామ్ ఖాసిమ్ వద్ద సేవింగ్ ఖాతాలతోపాటు డిపాజిట్ ఖాతాలు ప్రారంభించి గత కొంతకాలంగా చెల్లిస్తున్నారు. ఏజెంట్ అయిన ఖాసీం నేరుగా ఇంటికి వచ్చి నగదు తీసుకెళ్లేవాడు. అయితే నగదు జమ పుస్తకాలు మాత్రం తన వద్దనే ఉంచుకుని పోస్టాఫీసులో ఉన్నట్లు నమ్మించాడు. ఈ ఆరుగురి ఖాతాల్లో సుమారు రూ.70 లక్షలు పొదుపు చేశారు. ఈ క్రమంలో తాము సేవింగ్ చేసిన పొదుపులో కొంత నగదు అవసరమై తెచ్చివ్వాలని వారు కోరారు. అయితే, రోజులు గడుస్తున్నా నగదు తెచ్చివ్వకుండా వాయిదాలు వేస్తూ కుంటుసాకులు చెబుతున్నాడు. దీంతో అనుమానం వచ్చిన నారాయణమ్మ పోస్టాఫీసుకు వెళ్లి విచారించగా వారి ఖాతాలో సుమారు రూ.31 లక్షలు గల్లంతు అయ్యిందని గుర్తించారు. ఏజెంట్ ఇమామ్ ఖాసిమ్ మూడేళ్ల నుంచి ఖాతాదారుల సంతకాలు పోర్జరీ చేసి విడతలవారీగా నగదు డ్రా చే సుకుని స్వాహా చేసినట్లు తేలింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ స్థానిక పోస్టాఫీసులో ఫిర్యాదు చేశారు.



పోస్టల్ ఏజెంట్ ఇమామ్ ఖాసిం

‘ఎన్టీఆర్ వైద్యసేవ’ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● క్రమశిక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో నిబంధనలను అతిక్రమించే ఆసుపత్రులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆసుపత్రుల్లో చేరే రోగుల నుంచి నగదు వసూలు చేస్తే, ఆయా ఆసుపత్రులకు భారీ జరిమానాలు విధిస్తామన్నారు. రోగనిర్ధారణ కోసం అదనంగా రోగులు వద్ద డబ్బులు వసూలు చేస్తున్న కొన్ని ఆసుపత్రులను అధికారులు గుర్తించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 12 ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఆయా ఆసుపత్రుల నుంచి వివరణ తీసుకున్నామని చెప్పారు. మరోసారి ఇలాంటి తప్పులు జరిగితే ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమ న్వయకర్త డాక్టర్ సుధీర్‌కుమార్, మేనేజర్ వెంకట మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఉయ్యాల గజ్జె కడితే..

ఉర్రూతలే!

● ఏడు పదుల వయసులోనూ కళకు జీవం
● గురువుగా వందల మందికి తర్ఫీదు
● ఎన్నో అవార్డులు, ప్రశంసలు

చూడ చక్కని పంచెకట్టు... నడుముకు కండువా.. కాళ్లకు గజ్జెలు కట్టి పండరిభజనలో దిగితే ఏడు పదుల వయసులోనూ ఆయన నవ యువకుడే. యాభై ఏళ్ల కిందట ఎంత ఉత్సాహమో.. నేటికీ అంతే!. పండరిపురంలో ఆయన అడుగు పడిందో ఆ తన్మయత్వంతో అందరూ ఓలలాడాల్సిందే. చేతిలో మైక్ తీసుకుని "ఇక ఎంత దూరమో.. ఎరుగానే పండరిపురం ఎంత దూరమో... శ్రీరంగడు ఉండే ఆ... పండరిపురం ఎంతదూరం మో.." అంటూ పాట పాడుతూ కులుకుతూ అడుగేస్తుంటే విన్న ప్రజలంతా ఇళ్లలో నుంచి పండరిపురానికి ఉరుకులమీద చేరుకోవాల్సిందే. పురాతన జానపద కళకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైనా, ప్రజల ఆదరణతో ప్రాచీన కళకు జీవం పోస్తున్నారు. ఉయ్యాల కృష్ణయ్యదాస్.

\- సంగం (ఆంధ్రజ్యోతి)

ఉయ్యాల కృష్ణయ్య దాస్ స్వగ్రామం సంగం. ఉయ్యాల వెంకయ్య, వెంకమ్మ తల్లిదండ్రులు. వీరిది వ్యవసాయ కుటుంబం. చదువు ప్రాథమిక విద్య. మేనమామలు వీధి భోగాతాలు వేసేవారు. పాఠశాలలకు వేసవి సెలవులప్పుడు వారితోపాటు కృష్ణయ్య దాస్ కూడా వెళ్లేవాడట. ఆవిధంగా కళలపై మక్కువ ఏర్పడిందాయనకు. ఈ క్రమంలో సంగం గ్రామానికి సమీపంలో ఉన్న తరుణవాయిలో చేజర్ల మండలం ఆదూరుపల్లికి చెందిన చీర్ల సుబ్బయ్య దాస్ ఆధ్వర్యంలో పండరి భజన అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని తెలిసి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అప్పుడు కృష్ణయ్య దాస్ వయసు 11 ఏళ్లు. రాత్రి నుంచి తెల్లవారి వరకు అక్కడే ఉండి భజన చూశాడు. ఎంతో భక్తితో ఉల్లాసంగా సాగే పండరి భజన చూశాక తాను కూడా నేర్చుకోవాలని తలిచాడు. ఆ తరువాత అదే గురువు సంగంలో ఓ చిన్నారుల బృందానికి పండరి భజన నేర్పడం ప్రారంభించారు. ఆ బృందంలో ఉయ్యాల కృష్ణయ్య ఒకడు.

ఐదు జిల్లాల్లో 500 బృందాలకు శిక్షణ

ఉయ్యాల కృష్ణయ్య దాస్‌కు ఇప్పుడు ఏడు పదుల వయస్సు. ఈ యాభై ఏళ్లలో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, కడప, గుంటూరు జిల్లాల్లో సుమారు 400 గ్రామాల్లో 500 బృందాలకు పండరి భజనలో శిక్షణ ఇచ్చాడు. అయితే నేర్పినందుకు ఎక్కడా పైసా కూడా డిమాండ్ చేసిన సందర్భాల్లేవు. నేర్చుకొనేందుకు యువకులు ముందుకు వస్తే చాలు అక్కడకు వెళ్లి నేర్పేవారు. వారిచ్చే పాతికోపరకో తీసుకుంటాడు. ఈయన వద్ద శిక్షణ పొందిన పలువురు యువకులు నేడు పండరి భజన గురువులుగా రాణిస్తున్నారు.



ఉయ్యాల కృష్ణయ్య దాస్

● ప్రశంసలు, అవార్డులే సంపద

పండరి భజనకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైనా తిరుమల, తిరుపతి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, విజయవాడ వంటి క్షేత్రాల్లో జరిగే బ్రహ్మోత్సవాల్లో బృందాలతో వెళ్లి ప్రదర్శనలు ఇస్తూ ప్రాచీన కళకు జీవం పోస్తున్నారు కృష్ణయ్య దాస్. ఈ క్రమంలో ఎంతోమంది ప్రముఖుల నుంచి ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. వీటన్నింటికంటే పండరి భజన కళను నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో పరిచయం చేయడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యమే తనకు తృప్తినిస్తుందని ఆయన గొప్పగా చెబుతున్నారు.



నాటి కలెక్టర్ నుంచి సత్కారం అందుకుంటున్న దాస్

● 60 రోజుల్లో శిక్షణ పూర్తి

గ్రామంలో 30 మంది యువకులంతా 60 రోజుల్లో పండరి భజన, కోలాటం నేర్చుకుని అగ్నిగుండం మహోత్సవం వేశారు. ఆ బృందంలోని యువకుల్లో ఉయ్యాల కృష్ణయ్య స్వరం, గానం ఎంతో బాగుండటంతో గురువు సుబ్బయ్య దాస్ ప్రోత్సహించారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడ పండరి భజన నేర్పుతున్నా కృష్ణయ్యను వెంట తీసుకుని వెళ్లేవారు. ఈ క్రమంలో ఏడవ తరగతిలోనే చదువు మానేసి సొంత పశువులను పొలానికి తీసుకుపోయేవాడు. అలా చాలా ఖాళీ సమయం దొరకడంతో పండరి భజన గేయాలు పాడటం, ఆలపించడంలో బాగా రాటుదేలాడు. ఇది గమనించిన గురువు సుబ్బయ్యదాస్ పండరి భజనలో కృష్ణయ్యతో కొన్ని పాటలు పాడించేవారు.

● 18వ యేటనే గురువుగా...

ఉయ్యాల కృష్ణయ్యకు 18 యేట మొదటిసారి ఏఎస్ పేట మండలం పాతనాపురంలో పండరి భజన బృందానికి గురువుగా బృందం తయారు చేశాడు. మంచి ఆదరణ వచ్చింది. అక్కడి నుంచి పండరి భజననే వృత్తిగా చేసుకున్నాడు. ఇప్పటికి 50 యేళ్లుగా పండరి భజన, కోలాటం, చెక్ భజన గురువుగా కొనసాగుతున్నారాయన



పండరి భజన వేదిక (ఫైల్)

అత్యాచారాలు, హత్యల నివారణకు

చిత్తశుద్ధితో వ్యవహరించాలి

● ఓపీడీఆర్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు నివారించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) జిల్లా కార్యదర్శి ఆర్.శివశంకర్ కోరారు. నెల్లూరులోని ఓపీడీఆర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వూరు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం శివశంకర్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు నివారించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అశ్లీల కార్యక్రమాలు, సారా, గంజాయి, నివారించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లపై చర్చించామన్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా అతి అంచనాలతో కూడిన అంకెల గారడీ, ప్రజాసంక్షేమాన్ని నీరు కార్చేలా బడ్జెట్‌లు ఉన్నాయన్నారు. సోమశిల ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి సాగునీరును సమృద్ధిగా అందించాలని కోరారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. గిట్టుబాటు ధరతో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, కమిటీ సభ్యులు దర్శిగుంట వెంకటరమణయ్య, సూరిపాక నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.




కరపత్రాలు చూపుతున్న ఓపీడీఆర్ సభ్యులు

ఇంటర్ ఫస్టియర్

ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

నెల్లూరు(విద్య), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 79 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు జనరల్ విభాగంలో 27,613 మంది హాజరు కావాల్సి ఉండగా, 721 మంది గైర్హాజరు కాగా 26,892 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 1394 మంది హాజరు కావాల్సి ఉండగా 164 మంది గైర్హాజరు కాగా, 1230 మంది హాజరయ్యారు. మొత్తం మీద పరీక్షకు 28,122 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు నగరంలోని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ప్రశ్నపత్రాల పంపిణీ సమయంలో సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ఆర్ఐవో 6, డీవీఈవో 4, డీఈసీ సభ్యులు 4, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 28 కేంద్రాలను పరిశీలించారు.



పోలీస్‌స్టేషన్‌లో పరీక్షల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

పరివార దేవతలకు దాతలే దిక్కు!

● జొన్నవాడలో నిత్య కైంకర్యాలకు మంగళం
● విధులు విస్మరించిన పరిచారకులు
● భక్తులు ఇస్తేనే వస్త్రాల అలంకరణ
● అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

బుచ్చిరెడ్డిపాళెం మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో పరివాత దేవతలకు నిత్య కైంకర్యాలు ఎంతోకాలంగా మంగళం పాడేశారు. ముగ్గురు పరిచారకులు ఉన్నా పరివార దేవతల నిత్యకైంకర్యాలలో పవిత్రమైన మంగళస్నానం, పసుపు కుంకుమ అక్షించడం, ధూపదీపాలు పెట్టే విధులు పక్కన పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. ఆలయ ప్రాంగణంలో వీరభద్రుడు, దక్షిణామూర్తి, గణపతి, చండీశ్వరుడు, శ్రీ మహావిష్ణువు, షణ్ముఖ సుబ్రహ్మణ్యం, బ్రహ్మ, దుర్గాదేవి, కాలభైరవుడు, సూర్యభగవానుడు ఇలా పది మంది పరివార దేవతలు ఉన్నారు. నిత్యం మంగళస్నానాలు చేయించి వస్త్రాల అలంకరణ, పసుపు కుంకుమలతో అక్షించి దీపారాధనలు చేయాలి. ఇదంతా ఆలయంలో ప్రధాన మూలవరుల నిత్యకైంకర్యాలు (పులకాపు) పూర్తయ్యేలోపు జరగాలి. ఆ తరువాత వంట స్వామి 3 నివేదనలను వేర్వేరుగా తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆది శంకరాచార్యులు, పరివారదేవతలకు నివేదన సమర్పిస్తారు. ఆ తర్వాత అష్ట దిక్పాలకులకు బలిహరణ టెంకాయలు, పండ్లు సమర్పించి మొదటి హారతి ఇస్తారు. ఇదంతా జరిగాకే భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం ఉంటుంది. అయితే, ఆలయంలో ఇవేమీ జరగడం లేదు. భక్తులే రాహుకాల దీపారాధనలు, ఇతర పూజల కోసం పరివార దేవతలకు స్నానాలు చేయించడం, వస్త్రాలు కట్టి పసుపు కుంకుమలు అక్షించి పూజలు నిర్వహిస్తున్నారు. కట్టిన వస్త్రాలనే శుభ్రంచేసి మళ్ళీ కడుతున్నారు. ఇటీవల నెల్లూరుకు చెందిన సుధాకర్ అనే దాత తెచ్చిన వస్త్రాలను కట్టినట్టు ఆలయ సిబ్బందే చెబుతుండటం గమనార్హం. ఆ దాత ప్రతి 3, ఆరునెలలకొకసారి వస్త్రాలు తెచ్చి ఇస్తారని, అప్పుడు ఆ దేవతలకు వస్త్రాలు మారుస్తున్నట్టు చెప్తుండటం విశేషం. ఈ ఇషయమై ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా త్వరలో సమావేశం ఏర్పాటు చేసి నిత్యకృత్యాల నిర్వహణకు సంప్రదాయబద్ధంగా చర్యలు చేపడతామని తెలిపారు.



జొన్నవాడ ఆలయంలో దుర్గాదేవికి వస్త్రాల అలంకరణ చేస్తున్న భక్తురాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	119
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8328
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ. 101.20

50 శాతం రాయితీతో విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

● విజయకుమారి, ఏఈ



విడవలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు వాడుకుంటున్న అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విడవలూరు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు విజయకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె వివరాలు వెల్లడించారు.

? అదనపు లోడ్ అంటే ఏమిటి.

! కొత్తగా కనెక్షన్ తీసుకునేటప్పుడు గృహంలోని ఉపకరణాల లోడ్‌ని లెక్కించి 1కిలో వాట్‌కి రూ.2,400 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వినియోగం తప్పని సరిగా మారింది. అందువలన ప్రతినెల వారు 2కిలో వాట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. దీనినే అదనపు లోడు అంటారు.

? అధిక లోడ్ వాడితే ఎటువంటి చర్యలు తీసుకుంటారు.

! సాదారణంగా ప్రతి ఒక్కరు ఒక్క కిలోవాట్‌కి రుసుము చెల్లించి 2, 3 కిలో వాట్ల విద్యుత్‌ని వినియోగిస్తున్నారు. అందు వలన ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడటం వలన మరమ్మతులకు గురవుతున్నాయి. ఎక్కువ లోడ్ వాడుతున్నట్లు గుర్తిస్తే వారికి చట్టపరమైన జరిమానా విధిస్తారు.

? సూర్యఘర్ పథకం మండలంలో అమలు పరుస్తున్నారా లేదా.

! కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం కింద విడవలూరు సబ్‌స్టేషన్ పరిధిలో 6,413 గృహ సర్వీస్‌లు ఉండగా ఇప్పటి వరకు 368 గృహాలను గుర్తించాము. రెండు ఇళ్లకి సౌర పలకాలను అమర్చటం జరిగింది. అవి విజయవంతగం ఫలితాలను ఇస్తున్నాయి.

? ప్రభుత్వ భూముల్లో విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

! ప్రభుత్వ భూముల్లో విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. అటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు!

● కనీస వసతుల కరువు ● లోపలికి రాని బస్సులు ● ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



అధ్వానంగా మరుగుదొడ్లు



పని చేయని తాగునీటి కొళాయిలు



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు

తోటపల్లి గూడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తోటపల్లి గూడూరులో ఉన్న ఆర్టీసీ బస్టాండు కనీస వసతులు లేక నిరుపయోగంగా మారింది. ఈ బస్టాండులో వసతుల కల్పనపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఇస్కపాలెం, తోటపల్లి, మాచెర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకాయపూడి, చంద్రశేఖర్‌పురం, ఆనంతపురం, ఈదూరు గ్రామాలకు ఈ ఆర్టీసీ బస్టాండు కూడలిగా ఉంటుంది. కాగా బస్టాండు అధ్వానంగా ఉండడం, బస్సులు లోనికి రాకుండా బయట నుంచి వెళ్లి పోతుండడంతో లక్షలు పోసి నిర్మించి బస్టాండ్ నిరుపయోగంమైంది. కానీ రోజు ఇక్కడి వచ్చే వందలాదిమంది ప్రయాణికులు ఎండకు ఎండ, వానకు అవస్థలు పడుతున్నారు. బస్టాండు ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేక దుర్వాసన వస్తోంది. తాగునీటి కుళాయిలు ఉన్నప్పటికీ దానిని పర్యవేక్షించే వారు లేక నిరుపయోగమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. దీంతో పాటు రాకపోకలు సాగించే వారికి బస్సులు వచ్చే సమయాలు తెలియక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు ఆవరణలో చెత్తాచెదారంతో నిండుకుని దారుణంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనాన్ని చేకూర్చే ఆర్టీసీ బస్టాండుని నివియోగంలోనికి తీసుకుని రావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్తతో సంపద సృష్టిపై అవగాహన ఉండాలి



మనుబోలులో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న రాపూరు కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు

మనుబోలు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పంచాయతీల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని రాపూరు ఎంపీడీవో భవాని అన్నారు. స్థానిక చెత్త సంపద కేంద్రంలో మంగళవారం రాపూరు మండలం కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు, క్లాప్‌మిత్రలకు కేంద్రంలో తయారు చేసిన వర్మి కంపోస్టును చూపించారు. దానిని ఎలా తయారు చేస్తారో వివరించారు. గ్రామాల్లోంచి వచ్చిన చెత్తను నాడెప్‌ల్లో ఉంచి, తరువాత చెత్తను పలురకాలుగా వేరుచేయాలని వివరించారు. అనంతరం మనుబోలులో ఇళ్ల నుంచి సేకరించే చెత్తను ఎన్నిరకాలుగా వే రుచేయాలో క్షేత్రస్థాయి పరిశీలన చేయించారు. వర్మికంపోస్టు తయారు చేయడం, దానిని విక్రయించడం, పంచాయతీలకు తద్వారా సంపద తీసుకువచ్చే విధానంపై పూర్తిస్థాయిలో మనుబోలు మండల పంచాయతీ విస్తరణాధికారి నారాయణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాపూరు ఈవోఆర్‌డీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కసుమూరు పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత

వెంకటాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవలు, ఇంటింటి సర్వే, తదితర విషయాలపై వైద్యా ధికారిని డాక్టర్ ఎస్ ప్రవళ్లికతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంపొందించాలని, గర్భిణులను త్వరగా గుర్తించి వారికి అన్నిరకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. టీకాలు వేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలను అందించాలని, అన్ని రకాల సర్వేలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. శిశు సంరక్షణను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, హెచ్‌వీ రాజేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులున్నారు.

వైసీపీపై బురద జల్లొద్దు

వెంకటాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు గిరిజనుల భూములు లాక్కున్నారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదుపై వాస్తవాలను నిగ్గు తేల్చాలని, తమపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని వైస్ ఎంపీపీ, జిల్లా వైసీపీ కార్యదర్శి కనుపూరు కోదండరామిరెడ్డి, రైతు సంఘం నేత ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని సర్వేపల్లిలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. గిరిజన భూములు పరిశ్రమల యాజమాన్యాలు ఆక్రమించి ఉంటే విడిపించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. అధికారంలో టీడీపీ ఉన్నందున అధికారులు విచారణ చేపట్టి బాధ్యులు ఎంతటివారైన కఠినంగా శిక్షించాలన్నారు. సర్వేపల్లి వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

చౌదరిపాలెంలో పొగాకు బ్యారెన్ దగ్ధం

● రూ.6 లక్షల ఆస్తి నష్టం



బ్యారెన్‌లో వ్యాపించిన మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చౌదరిపాలెం చిడిపోతు వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారెన్ మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బ్యారెన్ సామగ్రితో పాటు బ్యారెన్‌లో పేర్చిన పొగాకు కాలిబూడిద అయ్యింది. విషయం తెలిసిన అగ్నిమాపక కేంద్రం అధికారి రామసిద్దార్థ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూరల్ ఎస్‌ఐ తిరుమల రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడి నుండి వివరాలు తెలుసుకున్నాడు. ప్రమాదంలో రూ.6 లక్షల నష్టం జరిగినట్లు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు.

భర్తపై దాడి కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనలో వేదాయపాలెం పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు, నెల్లూరు నగరంలోని ఉమారెడ్డిగుంటకు చెందిన గాయత్రి, బాలరాజు దంపతులు. వారికి ఓ పాప. భర్త ప్రవర్తనతో విసుగు చెందిన గాయత్రి తన కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బాలరాజు వేరే మహిళతో సన్నిహితంగా ఉంటుండటంతో భార్య నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆయన సోమవారం రాత్రి ఆమెపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన అత్తమామలు, వదినపై కూడా దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు కుటుంబసభ్యులతో కలిసి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలం వివాదం.. కత్తితో దాడి

ఇందుకూరుపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చట్టేవారి కండ్రిగలో పొలం వివాదం నేపథ్యంలో నెట్రంబాక వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన నెట్రంబాక శ్రీనివాసులు సోమవారం మొద్దుకత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు... గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వే విషయంలో వీరిరువురి మధ్య వివాదం జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవించిన నెట్రంబాక శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుపై మొద్దుకత్తితో దాడి చేసి పరారయ్యాడు. చెవి మధ్య భాగంలో తెగిపోయిన క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆడుకుంటూ తప్పిపోయిన బాలిక

● గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



తప్పిపోయిన చిన్నారిని తీసుకువస్తున్న చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఏటో వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుపెట్టుకుంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలికను గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ముంగమూరువీధిలో శంకర్‌సింగ్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కనకమహల్ సెంటర్‌లో పవర్‌టూల్స్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుమార్తె మాధవిసింగ్ (3) మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటివద్ద ఆడుకుంటూ తప్పిపోయింది. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విషయాన్ని ఎస్పీ కృష్ణకాంత్‌కు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారంగా చిన్నారి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కాపువీధిలో చిన్నారి ఏడుస్తూ ఉండగా, వినోద్‌కుమర్ అనే వ్యక్తి చేరదీశాడు. అదే సమయంలో చిన్నబజారు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా వారికి చిన్నారి గురించి తెలియజేశారు. వారు చిన్నారిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే కుమార్తెను అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

కావలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంకు చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ గోపి నరశింహ మూర్తి తీవ్ర గాయపడ్డారు. తన ఐషర్ లారీలో అమలాపురం నుంచి చెన్నైకు అరటికాయల లోడుతో బయలుదేరాడు. మార్గమధ్యలోని ముసునూరు సమీపంలో మద్యం తాగిన లారీ డ్రైవర్ ఒక్కసారిగా లారీని రోడ్డుపై ఆపాడు. వెనుకనే వస్తున్న ఐషర్ లారీ ముందు ఆగిన లారీని ఢీకొంది. విషయం తెలిసిన హైవే మొబైల్ సిబ్బంది నరశింహ మూర్తిని అతికష్టం మీద బయటకు తీసి కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో రూరల్ పోలీసుల పర్యవేక్షణలో నెల్లూరు తరలించారు. కుటుంబసభ్యులు వచ్చి అతన్ని కాకినాడకు తీసుకెళ్లారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రిలయన్స్ భూముల్లో వన్యప్రాణులు

ముత్తుకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నంలోని రిలయన్స్ భూముల్లో వన్యప్రాణులు ఉన్నాయన్న సమాచారంతో మంగళవారం కలకలం రేగింది. ఈ భూముల్లో విపరీతంగా పెరిగిన మొక్కలను తొలగించేందుకు రిలయన్స్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం అడవిగా పెరిగిన చెట్ల మధ్య నుంచి చుక్కల దుప్పులు బయటకు వచ్చాయని, కొందరు వాటిని వేటాడారని ప్రచారం జరిగింది. వన్యప్రాణుల సంచారం సమాచారం తెలుసుకున్న జిల్లా అటవీ శాఖ అధికారులు రిలయన్స్ భూముల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రిలయన్స్ భూముల్లో పరిశీలన చేపట్టామన్నారు. కొన్ని చుక్కల దుప్పులు, అడవి పందులు కనిపించాయని స్థానికులు చెప్పారన్నారు. అయితే క్లియరెన్స్ కోసం చెట్లను తొలగించినందున వన్యప్రాణులు పరిసర ఆవాస ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిలయన్స్ అధికారులకు పలుసూచనలు చేశామన్నారు. యంత్రాలతో పనులు చేస్తున్నందు వల్ల వన్యప్రాణులు పాదముద్రలు కనిపించలేదన్నారు. పరిసర ప్రాంతాల్లోని పొలాలు, చెట్ల మధ్య వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలని కోరారు.

ముందస్తుగా మహిళా దినోత్సవం



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ని సన్మానిస్తున్న అధ్యాపకులు

విడవలూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విడవలూరు డిగ్రీ కళాశాల్లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల పురోగతికి, కళాశాల ఉన్నతికి పాటుపడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సుజాతని అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా వికాశానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. మానవుని పుట్టుకని మూలమైన మహిళలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

మనుబోలు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలను మంగళవారం జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) కే.మధుబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులు పరీక్షరాసే తీరు, నీరు, వైద్య సదుపాయాలు పరిశీలిచాఆరు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 123మంది హాజరుకావాల్సి ఉండగా 7మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీవో వెంకటరమణ, సీఎస్‌వో దిలీప్‌కుమార్ తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

తోటపల్లిగూడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరులో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏస్తేరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కొరకు 9640882494 నెంబరుని సంప్రదించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం...



తేమశాతం యంత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సుబ్బయ్య

మనుబోలు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సిద్ధం చేసిన 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువస్తే కొనుగోలు చేస్తామని తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన మనుబోలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటైందన్నారు. కేంద్రంలో తేమశాతం యంత్రాలు, 3వేల గోను సంచులు, రిజిష్టర్‌లు సిద్ధంగా ఉంచామన్నారు. కేంద్రాలను మనుబోలు సొసైటీ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రస్తుతం కేఎన్ఎం, షుగర్‌లెస్ ధాన్యానికి మంచి ధర ఉందని, రైతులు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జహీర్, వీఏఏ తేజ, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శ్రీనువాసులు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిరంతరం భద్రత ప్రమాణాలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సీఈవో జగదీష్ పటేల్ తెలిపారు. కృష్ణపట్నం పోర్టులో జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత సుస్పష్టంగా కనిపించేలా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగితే ఆ వ్యక్తి యొక్క కుటుంబం ఎక్కువగా ప్రభావితమవుతుందన్నారు. పని ప్రదేశంలో జరిగే ప్రమాదాల నుంచి తనను తాను రక్షించుకోవాలన్నారు. ప్రమాదకర ప్రవర్తనలను తొలగించడం ద్వారా భద్రత అనేది వ్యక్తిగత అజెండాగా పాటించాలన్నారు. ఏకేపీఎల్ బృందం ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు 54వ జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

● ఎస్ఈఐఎల్‌లో..

ఎస్ఈఐఎస్‌లో ఎనర్జీ విద్యుత్ కేంద్రంలో మంగళవారం 54వ జాతీయ భద్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఅండ్ఎంహెచ్ సునీల్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ఎస్ఈఐఎస్‌లో భద్రత అత్యంత ముఖ్యమైనదని, అందరికీ సురక్షితమైన కార్యస్థలం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం భద్రత అంశాలకు సంబంధించి ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టిన చెత్త తరలింపు రిక్షాలు



తుప్పు పట్టి నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ బండ్లు

పొదలకూరు గ్రామ పంచాయతీలో చెత్తను తరలించే రిక్షాలు పోలీసస్టేషన్ పక్కన ఉన్న పరిసరాల్లో మూలనపడి తుప్పు పడుతున్నాయి. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం శని, ఆదివారాల్లో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ కూడా చేపట్టింది. అయితే పొదలకూరు పంచాయతీకి గతంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రిక్షా బండ్లు ఇచ్చింది. సంబంధిత అధికారులు వాటిని వినియోగించకపోయినా, కనీసం భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి వర్షానికి తడిచి.. ఎండకు ఎండి తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. లక్షల విలువ చేసే చెత్త రిక్షాలు ఇలా తుప్పు పడుతుంటే పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- పొదలకూరు(ఆంధ్రజ్యోతి)

డెయిరీ సహకార సంఘాలపై అవగాహన



మాట్లాడుతున్న డెయిరీ ఏడీ సురేష్

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని రెడ్డిపాళెం, మునులపూడి, సాల్మానుపురం, మినగల్లు గ్రామాలలో మంగళవారం మహిళలతో డెయిరీ సహకార సంఘాల (ఎండీఎస్ఎస్) ఏర్పాటుపై అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ డెయిరీల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై జిల్లా డెయిరీ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బాలకోటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, వెటర్నరీ అసిస్టెంట్లు, పాడి రైతులు, పాల్గొన్నారు.

'మద్యం' సిండికేట్..!

● ఊరూరా బెల్టు దుకాణాలు ● లైసెన్సు షాపులో క్వార్టర్‌పై రూ.20 అదనం ● గ్రామాల్లో రూ.30 నుంచి 40 వసూలు ● మందుబాబుల జేబులకు చిల్లు ● నిబంధనలకు తూట్లు ● అధికారులకు తెలిసినా మౌనం

ఇందుకూరుపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ప్రభుత్వ మద్యం పాలసీ నిబంధనలకు తూట్లు పొడిచి సిండికేట్‌గా మారారు. ధనార్జనే ధ్యేయంగా అనధికార బెల్టు షాపుల ఏర్పాటుకు తలుపులు తెరిచారు. లైసెన్సు షాపు నుంచి మద్యం కొనుగోలు చేసే బెల్టు దుకాణం నిర్వాహకుడి నుంచి క్వార్టర్ సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.20 అదనంగా వసూలు చేస్తుండగా అదే క్వార్టర్‌పై గ్రామాల్లో మందుబాబుల నుంచి రూ.30 నుంచి రూ.40 వసూలు చేస్తున్నారు. దీంతో మందుబాబుల జేబులకు చిల్లుపడుతోంది. వివరాల మేరకు.. ఇందుకూరుపేట మండలంలో 5 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిని లాటరీ ద్వారా దక్కించుకున్న లైసెన్సు దారులు కుమ్మక్కై సిండికేట్ దందాకు తెరలేపారు. దీంతోపాటు ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని బెల్టు షాపుల నిర్వహణకు ప్రోత్సాహం అందిస్తున్నారు. దీంతో బెల్టు షాపులు ప్రతి గ్రామంలో వీధి వీధిన ఎక్కడ పడితే అక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ బెల్టు షాపుల్లో ఒక క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.40అదనంగా వసూలు చేస్తుండడంతో సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఇదో మంచి మార్గంగా భావిస్తున్న ఆశావహులు బెల్టు షాపులు నిర్వహించేందుకు అత్యుత్సాహం చూపుతున్నారు. దీంతో షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలో ఒక బెల్టు షాపు నిర్వాహకుడు మద్యం సిండికేట్ వ్యాపారుల నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వెచ్చించి మద్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అందులో వివిధ బ్రాండ్లకు సంబంధించి సుమారు 50 క్వార్టర్ సీసాలు తగ్గకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ 50 సీసాలపై సిండికేట్ యజమానులు ఒక్కో క్వార్టర్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తూ రూ.1000 అదనపు ఆదాయం గడిస్తున్నారు. అదే క్వార్టర్‌పై బెల్ట్‌షాపు నిర్వాహకుడు మందుబాబుకు రూ.30 నుంచి రూ.40 విక్రయించి 50 సీసాలపై రూ.500 నుంచి రూ.1000 అదనంగా సంపాదిస్తున్నాడు. ఈ లెక్కన మండలంలోని అన్ని బెల్టు షాపులు పరిధిలో మద్యం సిండికేట్ వ్యాపారులు, బెల్టుషాపుల నిర్వాహకులు మందుబాబలను ఎలా దోపిడీ చేస్తున్నారో, సిండికేట్ దందా ఏ రీతిలో కొనసాగుతుందో ఊహించడానికే వీలుకానంతగా పరిస్థితి ఉంది. ఈ విషయాలన్నీ సంబంధిత అధికారులకు తెలిసినా ఎవరి స్థాయిలో వారికి ముడుపులు అందుతుండడంతో పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం సిండికేట్, బెల్టు దుకాణాల నిర్వహణ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. గ్రామాల్లో బెల్టు దుకాణాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

పావన పినాకినీకి...
వ్యర్థాల వ్యథ





పెన్నానది గర్భంలో ఎంగిలి పళ్లాల కుప్ప

నదిలో చెత్త పోయడమేకాక దాన్ని తగల బెట్టడంతో వాయు కాలుష్యం

నెల్లూరు నగరాన్ని చెత్త రహితంగా, డంపింగ్ యార్డులు లేకుండా.. సుందరంగా తయారు చేస్తామని ఒకపక్క పాలకులు ప్రకటనలిస్తుంటే... మరోపక్క జిల్లాకే జీవనాడి అయిన పెన్నా నది వ్యర్థాల వ్యథను అనుభవిస్తోంది. ఎక్కడెక్కడి చెత్తనంతా తీసుకొచ్చి నదిలో కుమ్మరిస్తున్నారు. జంతువులను వధించి వాటి చర్మాన్ని వలిచి మిగిలిన దేహాన్ని పెన్నలో వదిలేస్తున్నారు. ఆఖరికి కార్పొరేషన్ సిబ్బంది కూడా నగరంలో సేకరించిన చెత్తలో కొంత పెన్నాలో పోస్తూ నదీ గర్భాన్ని డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. రకరకాల వ్యర్థాలు, ముఖ్యంగా ప్లాస్టిక్ చెత్తతో పావన పినాకిని పంకిలమవుతోంది. అందరూ నడుంకట్టి పెన్నాను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.





ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయాధికారి శిరీషారాణి

తోటపల్లి గూడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) రైతులకు గిట్టుబాటు ధరని కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి శిరీషారాణి తెలిపారు. మండల పరిధిలోని నరుకూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

రసాభాసగా రెవెన్యూ సమీక్ష

● అడ్మిన్లు వర్సెస్ ఆర్ఐ ● ఏడీసీ, డీసీ ఎదుటే వాగ్వివాదం

నెల్లూరు(సిటీ), మార్చి 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. సచివాలయ అడ్మిన్లు, ఓ ఆర్ఐల మధ్య తలెత్తిన వాగ్వివాదం మితిమీరడంతో సమీక్ష గాడితప్పింది. విశ్వసనీయ సమాచారం మేరకు... ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ భవనంలో ఏడీసీ నందన్, డీసీ చెన్నుడు అధ్యక్షతన పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాలు, డివిజన్ల వారీగా వసూళ్లపై ఆరా తీస్తున్న సమయంలో ఓ ఆర్ఐ కలగచేసుకుని అడ్మిన్లపై దురుసు వ్యాఖ్యలు చేశారు. 'మీకు గ్రూప్-1, గ్రూప్-2లు అవసరమా...? మీకు రాయడం రాదు, చదవడం రాదు' అనడంతో అడ్మిన్లు ఒక్కసారిగా వాగ్వివాదానికి దిగారు. ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి సమావేశం రసాభాసగా మారింది. నువ్వెంతంటే నువ్వెంత... అనే స్థితికి వెళ్లడంతో జోక్యం చేసుకున్న ఏడీసీ, డీసీలు సర్దుబాటు చేశారు. రెవెన్యూ సమీక్షలో ఉన్నతాధికారుల ఎదుటే ఆర్ఐ వ్యవహరించడం వివాదస్పదంగా మారింది.

ఎంఎస్ఎంఈల స్థాపనకు ప్రోత్సాహకాలు వివరించండి

నెల్లూరు (హరనాథపురం) : మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ)ల స్థాపనకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వివరించాలని మంగళవారం అసెంబ్లీలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. కోవూరు నియోజకవర్గంలో ఇఫ్కో కిసాన్ సెజ్, ఏపీ ఐఐసీ భూములతోపాటు కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 100 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం చొరవ చూసి ఎంఎస్ఎంఈ కింద ప్రోత్సాహకాలు అందిస్తే స్థానికంగా పరిశ్రమలు స్థాపన ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. ఇందుకు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిస్తూ ప్రతి జిల్లాలో ముగ్గురు ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్స్‌ను నియమించి, ఎంఎస్ఎంఈల పట్ల ఆసక్తి చూపే పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ పాలసీల సమాచారం అందిస్తామన్నారు.

పుష్‌కాట్స్ సిద్ధం !



నగరంలోని నివాసాల నుంచి నిత్యం చెత్తను సేకరించడానికి వాహన కొరతను కార్పొరేషన్ ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటోంది. ఇందులో భాగంగా చెత్త వాహనాలు వెళ్లలేని చిన్న వీధులు, కాలువ గట్లు, కార్యాలయాలు వద్ద చెంతకుండీలను తీసుకువచ్చే పుష్‌కాట్స్ బండ్లు కొత్తవి కొనుగోలు చేశారు. అవి రెండు రోజుల క్రితం కార్పొరేషన్ కార్యాలయానికి చేరాయి. వీటిని డివిజన్లు, సచివాలయాల వారీగా కేటాయించనున్నారు.

-నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో పార్కుల నిర్వహణ



అధికారులతో మాట్లాడుతున్న ఏడీసీ నందన్

నెల్లూరు(సిటీ), మార్చి 4(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పార్కులను ప్రైవేట్ భాగస్వామ్యంతో మెరుగ్గా నిర్వహించనున్నామని ఏడీసీ నందన్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారవేత్తలు, సంస్థలు, ఏజెన్సీల భాగస్వామ్యంతో పార్కులను అభివృద్ధి చేసి, వాటి నిర్వహణ కొనసాగిస్తామన్నారు. నగరంలో 64 పార్కులున్నాయని, వాటిల్లో 36 పార్కులు ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

నవోదయం 2.0పై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం నవోదయం 2.0 సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ డీసీ టీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే నవోదయ 2.0లో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలన్నారు. మాదకద్రవ్యాల నిషేధంపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈసీ ఆర్ జగదీశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పీ. రమేష్‌బాబు, ఎస్ఐలు ప్రభాకర్‌రావు, ఎస్‌డి కాలేషావల్లి, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హేమచంద్రరావు, అధ్యాపకులు తదితరులు మాట్లాడారు.

విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'సోషల్ మీడియాలో మహిళల గోప్యతకు డిజిటల్ భద్రత అవసరం, ఆత్మరక్షణ అనేది ఒక ఎంపిక కాదు అవసరం, మహిళలు సురక్షితంగా పనిచేసే ప్రదేశం-వేధింపులపై మౌనాన్ని వీడండి, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు సురక్షితం-సవాళ్లు, మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర' అనే అంశాలపై ఈ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొని, అభిప్రాయాలను తెలియజేశారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ సమాజంలోని మహిళలో ఆత్మస్థైర్యాన్ని, శక్తిని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడమే ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, డీటీసీ సీఐ నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలి



మాట్లాడుతున్న మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు అందించే వైద్య పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి అనుమానితులకు వ్యాధి నిర్ధారణ త్వరగా చేపట్టి ఫలితాలు వెల్లడిస్తే వెంటనే వైద్య చికిత్సలు ప్రారంభించవచ్చన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ నిర్దేశించి లక్ష్యాలు పూర్తి చేసేందుకు రక్తపరీక్షలు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా గణాంక అధికారి సహన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు నిర్వహించిన పరీక్షల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీశారు... తొలగించడం మరిచారు !



రమేష్‌రెడ్డినగర్‌లో తొలగించని బురద

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రమేష్‌రెడ్డినగర్‌లో డ్రైనేజీ కాలువల్లో పూడికలు తీసి, ఆ బురదను అక్కడే వేశారు. సుమారు వారం రోజులు అవుతున్నా దాన్ని నగర పాలక సంస్థ అధికారులు తొలగించలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

గోషా ఆసుపత్రి... ఘోష

నిర్మాణం పూర్తయినా... అందుబాటులోకి రాని భవనం ● అనుమతులపైనే సందేహాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోషా ఆసుపత్రి

నెల్లూరు (వైద్యం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ స్థలంలో గోషా ఆసుపత్రిని నిర్మించారు. రూ. 3.82 కోట్ల వ్యయంతో ఈ ఆసుపత్రిని మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం పూర్తి చేసింది. 100 పడకల కోసం నిర్మించిన ఈ ఆసుపత్రి బాధ్యతను వైద్య ఆరోగ్యశాఖ చేపడుతుంది. ఇందులో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని వైద్యాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే నిర్మాణాలు పూర్తయినా, ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురాకపోవటంతో ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యం లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని వైద్య ఆరోగ్యశాఖ బావిస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాలని ప్రతిపాదనలు పంపి నెలలు కావస్తున్నా, ఆ ప్రతిపాదనలు బుట్ట దాఖలవు తున్నాయి. 2021 జనవరిలో ఈ ఆసుపత్రి నిర్మాణానికి అప్పటి పురపాలకశాఖామంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి అయింది. ఈ గోషా ఆసుపత్రికి ఫీవర్ ఆసుపత్రిగా కూడా వైద్య ఆరోగ్యశాఖ పేరు నమోదు చేసింది. గుంటూరులో ఫీవర్ ఆసుపత్రి ఉండగా తాజాగా నెల్లూరులోనూ అలాంటి ఆసుపత్రి అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇక్కడ గోషా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టింది. వైసీపీ ప్రభుత్వంలోనే నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చినా ఆసుపత్రిలో వైద్య సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

● వైద్యుల నియామకం ఎప్పుడు?

ప్రస్తుతం 30 పడకలతో చిన్న పిల్లల ఆసుపత్రిని ఈ గోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందు కుగానూ వైద్యులు, సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు పంపించింది. అంతేకాక ఎస్ఎన్‌సీయు యూనిట్‌తో పాటు ప్రత్యేక వైద్య పరికరాలు అవసరం ఉంది. వీటన్నిటి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ కూడా ప్రభుత్వానికి తెలియచేశారు. అయితే నియామకంతోపాటు పరికరాల కోసం వైద్యాధికారులు ఎదురు చూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



గోషా ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. తాజాగా చిన్నపిల్లల విభాగం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నియామకం జరిగితే ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వం నుంచి ఎప్పుడు అనుమతులు వస్తాయో వేచి చూస్తున్నాం. అవి రాగానే వైద్యులు, సిబ్బంది నియామకాలను పూర్తి చేస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

వంతెన నిర్మాణం ఎప్పుడు ?



గచ్చుకాలువపై కూలిన వంతెన

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చేపల మార్కెట్ నుంచి మూలాపేటకు వెళ్లే రోడ్డుపై ఉన్న గచ్చుకాలువ వంతెన గత ఏడాది భారీ వర్షాలకు కూలిపోయింది. దాని పునర్‌నిర్మాణం ఎప్పుడు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదభరితంగా ఉన్న ఆ వంతెన వద్ద కమ్ముల తో ఫెన్సింగ్ వేశారు. దాన్ని గురించి ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వేదాయపాలెం పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు, వెంకటాచలం మండలానికి చెందిన సింధు నగరంలోని ఓ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రతిరోజు ఆమె ఇంటి వద్ద నుంచి కళాశాలకు వెళ్లి వచ్చేది. ఈ నెల ఒకటిన ఆమె ఇంటి వద్ద నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో సోమవారం రాత్రి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● యువకుడి అదృశ్యంపై...

ఇంటి నుంచి యువకుడు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని తడికల బజారు సెంటర్ కు చెందిన సుమన్ కుమార్ అదే ప్రాంతంలో మొబైల్‌షాపు నిర్వహిస్తున్నారు. ఆయన గతేడాది డిసెంబరు 17న ఇంట్లో నుంచి పనినిమిత్తం బయటకు వెళ్లారు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు గాలించినా జాడ తెలియలేదు. బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా మంగళవారం తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీలు ప్రకటించాలి

నెల్లూరు(విద్య), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీల డ్రాఫ్ట్‌లో ఖాళీలను బహిర్గతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.సురేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీల నియామకాలను చేపట్టలేకానీ బ్లాక్ చేయడం సరికాదన్నారు. ఖాళీలను బ్లాక్ చేస్తే విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయని, సుదూర ప్రాంతాల్లో సుదీర్ఘ కాలం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తప్పుగా ఉన్నాయని, ఎక్కువశాతం ఈ నేపథ్యంలో డీఈవో స్థాయిలో వీటిని సరిచేసిన అనంతరం ఉపాధ్యాయుల నుంచి వ్యక్తిగతంగా అభ్యర్థనలు స్వీకరించాలని కోరారు.


రాజరాజేశ్వరి ఆలయంలో టెండర్ల ఖరారు



నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం జరిగిన బహిరంగ వేలంలో టెండర్లు ఖరారయ్యాయి. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, భక్తులు సమర్పించిన వస్త్రాలు విక్రయించుకునే హక్కు, కల్యాణ మండపం నిర్వహణ హక్కులకు వేలం జరిగాయి. కార్యక్రమంలో ఏసీ కే.జనార్దన్‌రెడ్డి, పూడిపర్తి టెంపుల్స్ ఈవో శ్రీధర్‌నాయుడు, ప్రధాన అర్చకులు రఘురామ మూర్తి, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాలో నగరం

నెల్లూరు(క్రైం) : డ్రోన్ నిఘా నీడలో నగరం ఉందని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని నగర డీఎస్పీ పీ. సింధుప్రియ హెచ్చరించారు. నగరంలోని నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో నవాబుపేట సెంటర్, కుసుమ హరిజనవాడ, ఎఫ్‌సీఐ కాలనీ, శెట్టిగుంట రోడ్డు, యనమలపాలెం, మైపాడురోడ్డు, సత్యనారాయణపురం ప్రాంతాలను ఆమె డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆ యా ప్రాంతాలపై డ్రోన్స్ ద్వారా నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి సేవించడం, అమ్మడం, రవాణా చేసేవారు పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో నవాబుపేట సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.



శేషాచలం కొండల్లో ఆకుపచ్చని అడవి ఒడిలో ఒదిగినట్టుగా ఉండే చల్లని, ప్రశాంత ప్రదేశం తిరుమల. మంద్రంగా వినిపించే గోవిందలు.. అన్నమయ్య కీర్తనలు.. శ్రీవేంకటేశ్వరుని దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ వాతావరణంలో సకల పరుగులనూ మరచి సేదదీరుతారు. అయితే ఈ ప్రశాంతత కొన్నేళ్లుగా భగ్నం అవుతోంది. శబ్ద కాలుష్యం తిరుమల కొండల హద్దులు దాటేస్తోంది. అసాధారణ స్థాయిలో శబ్దకాలుష్యం నమోదవుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉండాల్సిన శబ్దస్థాయి..

యూనివర్సిటీలు, ఆస్పత్రులు, ఆలయాలు వంటి వాటిని సైలెంట్ జోన్లుగా పరిగణిస్తారు. ఈ ప్రదేశాల్లో పగటి పూట 50, రాత్రి వేళలో 40 డెసిబెల్స్ కంటే ఎక్కువగా శబ్దాలు ఉండకూడదు. అనారోగ్యంతో ఉన్నవారికి, విద్యార్థులకు, దేవుడి సన్నిధిలో గడుపుదామని వచ్చిన వారికి శబ్దం ఒక శత్రువు. నివాస ప్రాంతాల్లో పగలు 55, రాత్రి 45 డెసిబెల్స్ దాకా భరించవచ్చు. వాణిజ్య ప్రాంతాల్లో ఇది 65-55 దాకా అనుమతి ఉంటుంది. పారిశ్రామిక వాడల్లో ఇది 75-70 గా ఉంటుంది.

తిరుమలలో ఇలా ఉంది..

గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రికార్డులను పరిశీలిస్తే తిరుమలలో సగటున పగటి వేళల్లో 60.5, రాత్రి వేళల్లో 59.68 డెసిబెల్స్ వరకు నాయిస్ లెవల్స్ నమోదయ్యాయి. అంటే వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నంత శబ్దం తిరుమలలో ఉంటోందన్నమాట. కొన్ని సందర్భాల్లో ఇండస్ట్రియల్ జోన్ స్థాయి శబ్దాలు కూడా తిరుమలలో నమోదయ్యాయి. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోంది. భక్తులు చెవులు మూసుకుని, మొఖం చిట్లించుకుని తిరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

గోవిందా..?

- తిరుమలలో పెరిగిపోతున్న శబ్దకాలుష్యం

హారన్ల మోత!

ప్రతిరోజు 7 నుంచి 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. రద్దీరోజులు, విశేష పర్వదినాల్లో వీటి సంఖ్య మరింతగా పెరిగిపోతుంది. వీటిలో ఆర్టీసీ బస్సులు, భక్తుల వాహనాలు, ట్యాక్సీలు, ద్విచక్ర వాహనాలు, లారీలు, టీటీడీ అధికారులు కార్లు, ఉద్యోగుల బస్సులు ఉంటాయి. కొవిడ్ తర్వాత దాదాపు 75 శాతం భక్తులు సొంత వాహనాల్లోనే తిరుమలకు చేరుకుంటున్నారు. ఫలితంగా తిరుమలలో విపరీతంగా వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ముందుకు కదిలేందుకు హారన్లు మోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. కాలంచెల్లిన ట్యాక్సీలు, వాహనాల ద్వారా కూడా వాయు, శబ్ద కాలుష్యాలు తిరుమలలో పెరిగిపోతున్నాయి. జన సందడి పెరగడంతో టీటీడీ బ్రాడ్‌కాస్టింగ్‌లో కూడా నాయిస్ లెవల్స్ ఎక్కువగా నమోదు అవుతున్నాయి.



అధ్యక్షా..

విదేశీ ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి తగ్గించండి

విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రస్తుతమున్న ఇంటర్న్‌షిప్ కాలపరిమితిని ఏడాది తగ్గించాలి. విదేశీ ఎంబీబీఎస్ విద్యను అభ్యసించిన విద్యార్థులు డాక్టర్ల అర్హతా ప్రవేశ పరీక్ష పాసైన తరువాత ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. 2021వ సంవత్సరం వరకు ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ చేస్తే సరిపోయేది. కొవిడ్, ఇతర సమస్యల వల్ల కాలేజీలకు వెళ్లి ఇంటర్న్‌షిప్ చేయలేని పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చింది. దీంతో ఎన్ఎంసీ ఇంటర్న్‌షిప్‌ను రెండేళ్లకు పెంచిందన్నారు. ఆ ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉద్యోగం వచ్చేందుకు మరో ఆరు నెలలు సమయం పడుతుండటంతో వైద్యవిద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం దేశంలో డాక్టర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని ఇంటర్న్‌షిప్‌ను ఏడాదికి కుదించేలా ఆరోగ్యశాఖా మంత్రి చర్యలు తీసుకోవాలి.

- విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

అమ్మ అలక చూడతరమా!



- వైభవంగా ఆదిదంపతుల పల్లకిసేవ

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకి సేవ వైభవంగా జరిగింది. గంగాదేవిని వివాహమాడాడని తెలిసి పరమశివుడిపై అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే పల్లకి సేవలో ప్రధానాంశం. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆసీనురాలై ఎదురుగా ఉన్న దర్పణంలో భక్తులకు దర్శనమిస్తారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను విశేష స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం వాహన మండపం వద్ద విద్యుత్తు కాంతులతో సిద్ధమైన పల్లకీల్లో ఆసీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. సకల పరివార దళం ముందు సాగగా స్వామి, అమ్మవార్లు చిద్విలాసులై భక్తులకు దర్శనభాగ్యం కల్పించి కరుణామృతం కురిపించారు. కోలాట నృత్యాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడవీధులు మార్మోగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోనే పల్లకీ సేవ చిట్టచివరి ఊరేగింపుగా నిర్వహిస్తారు. అందుకని స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



పల్లకిలో.. ఎదురుగా దర్పణంలో అమ్మవారి ప్రతిబింబం



నేడు ఏకాంత సేవ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ఉన్న పల్లియర (శయన మందిరం)లో ఈ క్రతువును నిర్వహించనున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను వెండి పల్లకిలో ప్రదక్షిణగా తిప్పి శయన మందిరంలో కొలువుదీర్చనున్నారు.

రేపటినుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

ముక్కంటి ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవలు గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దుచేసి ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. బుధవారంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. ఈక్రమంలో గురువారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు తిరిగి అందుబాటులోకి రానున్నాయి.

ఫ్లై ఓవర్‌పై అతివేగం

- 'గరుడ వారధి' రక్షణ గోడను ఢీకొన్న బైకు
- పైకి ఎగిరి పడిన యువకులు
- ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు



అభిరామ నాయుడు (ఫైల్ ఫొటో)



దెబ్బతిన్న బైక్



గరుడ వారధి రక్షణ గోడపై అభిరామ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి ఎక్కారు. బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజం సర్కిల్ వద్ద బైకును అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొన్నారు. ఇద్దరు యువకులు పైకి ఎగిరి పడ్డారు. రక్షణ గోడపైన పడిన అభిరామ నాయుడు మృతిచెందగా.. రోడ్డుపై పడిన సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన అభిరామా నాయుడు.. తిరుపతిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీ-టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఒక గదిని అద్దెకు తీసుకుని వుంటున్నారు. వీరిద్దరూ కలసి ద్విచక్ర వాహనంలో తిరుచానూరుకు వెళ్లారు. మంగళవారం వేకువజామున తిరుగు ప్రయాణంలో స్థానిక మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. ఆర్టీసీ బస్టాండు వైపు అతివేగంతో వేగంతో వస్తున్నారు. రామానుజపల్లి సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో మదనపల్లెకు చెందిన అభిరామా నాయుడు (24) డివైడర్‌పై పడి తలకు బలమైన రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు ప్రధాన కారణం అతివేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

ఇంటర్ పరీక్షలకు 827మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మంగళవారం జిల్లాలో 827 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో జిల్లాలో 101 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 33,294మందికి గాను 32,467మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

మేమింతే.. మారమంతే! - 6లో

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 15 కిలోలు స్వాధీనం

రేణిగుంట మార్చి4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే సీఐ యతేంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం 3వ నెంబర్ ప్లాట్‌ఫారంలో జీఆర్‌పీ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన మిల్టాస్ షిక్, మదాస్ అనుమానాస్పద రీతిలో తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని సోదాలు చేశామన్నారు. వారి వద్ద రూ.45 వేల విలువచేసే 15 కిలోల గంజాయి ఉండగా స్వాధీనం చేసుకొని మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.24
సహరి (గురువారం) : 5.07

తల్లి ఒడి చేరిన చిన్నారి



నరసింహులు దంపతులకు దీక్షితను అప్పగిస్తున్న తిరుమల పోలీసులు

తిరుమల, మార్చి4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కనిపించకుండాపోయిన బాలిక క్షేమంగా తల్లి ఒడికి చేరింది. తిరుమలలో చిరువ్యాపారులుగా ఉన్న విజయవాడకు చెందిన కరుణశ్రీ, నరసింహులు కూతురు నాలుగేళ్ల దీక్షిత ఆస్థానమండపం వద్ద ఆడుకుంటుండగా సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. వీరు రాత్రి 7.30 గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించి ఒక మహిళ వెంట పాప తిరుపతికి వెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఆ మహిళ ధరించిన దుస్తులు ఆధారంగా తిరుమలలోనే పని చేసే పారిశుద్ధ్య కార్మికురాలుగా గుర్తించారు. వెంటనే తిరుపతిలోని పోలీసులను అప్రమత్తం చేసి బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో రాత్రి 10.30 గంటల సమయంలో చిన్నారితో సహా మహిళను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే పాప ఆచూకీ కనిపెట్టిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

చెర్లోపల్లె సర్పంచికి కేంద్ర పురస్కారం

తిరుపతి (రూరల్/ఆటోనగర్), మార్చి4(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం చెర్లోపల్లె సర్పంచి బి.సుభాషిణికి జాతీయస్థాయి శక్త్ పంచాయత్ నేత్రి అభియాన్ పురస్కారం లభించింది. రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ గ్రామ పంచాయతీలు, మండలాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న మహిళలను జిల్లా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవ సదస్సుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా చెర్లోపల్లె పంచాయతీలో పలు అభివృద్ధి పనుల (సీసీరోడ్లు, యూడీఎస్)తో పాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చేలా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినందుకు పురస్కారం లభించింది. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ మహిళాదినోత్సవ సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖామంత్రి రాజీవ్ రాజన్ సింగ్ చేతులమీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. రూరల్‌మండలంలో మహిళా సర్పంచ్‌ల కేటగిరీల్లో ఈమెని ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న సర్పంచి సుభాషిణికి సీపీఐ రాష్ట్ర కార్యావర్గ సభ్యుడు ఎ. రామానాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.



కేంద్రమంత్రి రాజీవ్‌రాజన్ సింగ్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుభాషిణి



భక్తులను కలిసి అభిప్రాయ సేకరణ చేస్తున్న శ్రీవారి సేవకులు

నమస్కారం.. చెప్పండి మీ అభిప్రాయం!

- టీటీడీలో మొదలైన 'ఫీడ్‌బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్'

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, సేవలు, దర్శనానికి వచ్చిన సమయంలో కలిగిన ఇబ్బందులు వంటి అంశాలపై భక్తుల నుంచి టీటీడీ అభిప్రాయ సేకరణ మొదలైంది. ఏపీ డిజిటల్ కార్పోరేషన్ సహకారంతో 'ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్' ప్రారంభించారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు మూడు పద్ధతులను టీటీడీ ఏర్పాటు చేసుకుంది. ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్ సిస్టమ్), వాట్సాప్ మెసెజ్ మోడ్, ఫిజికల్ సర్వే ల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. దీనికి 'నివేదన' అనే పేరును పెట్టారు. ఐవీఆర్ఎస్, ఫిజికల్ సర్వే పద్ధతలను టీటీడీ ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది.

అన్నీ బావున్నాయి!

గత నెల 14 నుంచి 20వ తేద వరకు శ్రీవారిని దర్శించుకున్న వారిలో 36,385 మందికి కాల్స్ వెళ్లగా అందులో 13,294 మంది స్పందించారు. వీరిలో 61.12 శాతం మంది బాగుందనగా, 27 శాతం పర్వాలేదని, మరో 11.88 శాతం బాగాలేదనే జవాబులిచ్చారు. ఫిబ్రవరి మొదటి వారంలో 2,244 మంది భక్తులను ఫిజికల్ సర్వేతో 9 ప్రశ్నలు అడిగారు. 72.5 శాతం బాగుందని, 18.7 శాతం పర్వాలేదని, 8.8 శాతం బాగోలేదనే సమాధానాలు అందాయి. దీని ద్వారా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఆయా విభాగాలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా వాట్సాప్ మెసెజ్ మోడ్‌ను కూడా ప్రారంభించనున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.



ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,683

తలనీలాలు సమర్పించినవారు: 23,453

ఫటా ఫట్

తిరుపతిలో జాతీయస్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తూకివాకం వద్ద 35ఎకరాల్లో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు శాప్‌చైర్మన్ రవినాయుడు కృషి చేస్తున్నారు. మరోపక్క క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధికి జరుగుతున్న కృషి గురించి జిల్లా క్రీడాధికారి సయ్యద్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

- జిల్లా క్రీడాధికారి సయ్యద్

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులెంతవరకు వచ్చాయి?

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీనివాస క్రీడా సముదాయ అభివృద్ధి పనులను రూ.2కోట్లతో మొదలుపెట్టాం. ఇండోర్ స్టేడియంలో న్యూ ఉడెన్ ఫ్లోరింగ్, పెయింటింగ్, పైఅంతస్తులో రైఫిల్ షూటింగ్, జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాకింగ్‌ట్రాక్ పునరుద్ధరిస్తున్నాం. టెన్నిస్‌కోర్టు, సింథటిక్ లేయర్స్, గాల్వనైజింగ్ ఫెన్సింగ్‌కు రంగులు, ఈతకొలను మరమ్మతులు, గార్డెన్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రాల పరిస్థితి ఏమిటి?

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడులలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లుగా మరుగునపడిన ఈ కేంద్రాలను బాగుచేయడానికి ప్రభుత్వం అనుమతించింది. పెవిలియన్ బిల్డింగ్, ఇండోర్ స్టేడియం, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. సంరక్షకులు, సిబ్బంది నియాకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎప్పటికి పూర్తవుతుంది?

శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో తూకివాకం దగ్గర 35ఎకరాల భూమిని పరిశీలించాం. కలెక్టర్ ఇక్కడే ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు ప్రారంభమై పనులు చురుగ్గా సాగితే రెండేళ్లలో రెడీ అవుతుందని అనుకుంటున్నాం.

కోచ్‌ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారా?

కోచ్‌ల భర్తీపై ప్రభుత్వానికి నివేదించాం. హాకీ, ఫుట్‌బాల్, జూడో,రెజ్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్,వాలీబాల్, టెన్నిస్, ఖేలోఇండియా, హాకీ శిక్షకులు అందుబాటులో ఉన్నారు.

ఈసారి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారా?

ఈఏడాది 25వంతున రూరల్, అర్బన్ ప్రాంతాలను ఎంపికచేసి మెరుగ్గా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తాం. ఈ బాధ్యతలను ఔత్సాహిక పీడీ, పీఈటీలకు అప్పగిస్తాం. ఇందుకు గ్రాంట్స్ ఇస్తాం. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తాం.



మేమింతే.. మారమంతే!







నిబంధనలదేముందీ.. సవాలక్ష ఉంటాయి. అమలు చేయాలి కదా! తిరుపతి నగరంలో ఐదేళ్లు సాగిన అస్తవ్యస్థ ట్రాఫిక్ వ్యవస్థే ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల ఆచూకీ చాలా సార్లు కనిపించదు. కనిపించినా వారిది ప్రేక్షక పాత్ర మాత్రమే. ఉల్లంఘిస్తున్నారని ఎవర్నైనా ఆపితే.. ఎలాగూ నాయకుల నుంచి ఫోన్లు వస్తాయని అనుకుంటున్నారేమో.. చేతికి ఏదీ అంటకుండా గడిపేస్తున్నారు. ఏకంగా గరుడ వారధి మీదే ఎదురు ప్రయాణాలు సాగుతూ ఉంటాయి. ఎర్ర లైటు వెలుగుతున్నా కూడళ్లలో దూసుకుపోతూనే ఉంటారు. ఇక ఒకే వాహనం మీద ముగ్గురు కాదు.. నలుగురూ, ఐదుగురూ కూడా రయ్ మంటూ ప్రమాదాలను వెతుక్కుంటూ వెళ్లిపోతుంటారు. ఇంత గందరగోళపు ట్రాఫిక్‌లోనూ మొబైల్‌లో మాట్లాడుతూ ఫీట్‌లు చేస్తుంటారు. తిరుపతి నగర ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పనితీరుకు సాక్ష్యమే మంగళవారం కనిపించిన ఈ దృశ్యాలు..

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేణిగుంటలో ఎండీయూ ఆపరేటర్ నిర్వాకం

- కాటాకు అయస్కాంతం అంటించి బియ్యం పంపిణీ
- 10 కిలోలకు కిలో స్వాహా

రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ నిర్వాకంపై రేషన్ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కాటాకు అయస్కాంతం అంటించి ప్రతి 10 కిలోలకు కిలో స్వాహా చేస్తున్న సంఘటన మంగళవారం అత్తూరు గ్రామంలో వెలుగు చూసింది. స్థానిక కార్డుదారులు తెలిపిన వివరాలు... అత్తూరులో ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ గిరి గ్రామానికి చేరుకుని కార్డుదారులకు రేషన్ సరుకులు అందిస్తుంటాడు. అయితే మంగళవారం గ్రామంలో రేషన్ అందిస్తుండగా కాటాకు అయస్కాంతం అంటించి ఉండడాన్ని యువకులు గమనించి ఫొటోలు తీశారు. దీనిపై ఆపరేటర్ గిరిని ప్రశ్నించారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ గిరి బదులిచ్చారు. కాగా కార్డుదారులు మాట్లాడుతూ... గత వైసీపీ హయాం నుంచి ఆపరేటర్ ఇలాగే సరుకులు పంపిణీ చేస్తున్నాడని, దీనిపై పలుమార్లు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో యువకులు కాటాకు అయస్కాంతం అంటించిన ఫొటోను ఎమ్మెల్యేకు చేరేంత వరకు షేర్ చేయాలని హ్యాష్ ట్యాగ్ తగిలిచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో మండలంలో వైరల్‌గా మారింది. ఈవిషయంపై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా... ఆపరేటర్ గిరిపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. మంగళవారం జరిగిన నిర్వాకం తన దృష్టికి వచ్చిందని అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు



కాటాకు అంటించిన అయస్కాంతం

అప్పుల బాధతో లైన్‌మ్యాన్ బలవన్మరణం

- విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఘటన
- సూసైడ్ నోట్‌లో అప్పుల వివరాలు

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ట్రాన్స్‌కో లైన్‌మ్యాన్ సీహెచ్ మురళీకృష్ణ(57) మంగళవారం విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఉరేసుకుని మృతి చెందాడు. ఓజిలి ఎస్ఐ స్వప్న కథనం మేరకు వివరాలు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన మురళీకృష్ణ కురుగొండ సబ్ స్టేషనులో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. చాలాకాలంగా భార్యతో కలిసి నాయుడుపేటలో నివాసం ఉంటున్న ఆయన సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రిలీవ్ అవ్వాల్సి ఉంది. 8 గంటల సమయంలో ఏఈ అనిల్ ఫోన్ చేయగా మురళీకృష్ణ లిఫ్ట్ చేయలేదు. మళ్లీ మళ్లీ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మరో ఉద్యోగిని సబ్‌స్టేషను వద్దకు పంపారు. అతను వెళ్లి ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా మురళీకృష్ణ శ్లాబ్ కొక్కీకి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ట్రాన్స్‌కో ఏడీ, ఏఈతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సబ్‌స్టేషను వద్దకు చేరుకుని తలుపులు పగలగొట్టి మురళీకృష్ణ మృతదేహాన్ని కిందికి దింపారు. రికార్డులు పరిశీలించగా సోమవారం రాత్రి 12 గంటల వరకు విద్యుత్ రీడింగ్ నమోదు చేసినట్లు ఉంది. ఒంటిగంట నుంచి రీడింగ్ నమోదు చేయకపోవడంతో రాత్రి 12 - 1 గంట మధ్య ఉరేసుకుని ఉంటాడని ఎస్ఐ స్వప్న తెలిపారు. మురళీకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరికి వేలాడుతున్న మురళీకృష్ణ

అప్పుల వివరాలతో లేఖ

మురళీకృష్ణ ఉరేసుకునే ముందు తాను చేసిన అప్పుల వివరాలు రాసిపెట్టిన లేఖ సబ్‌స్టేషన్‌లో లభ్యమైంది. మొత్తం 26 మంది వద్ద అప్పు చేశానని, అందులో ఏడుగురు లాటరీ వాళ్లు ఉన్నట్లు తెలిపాడు. 19 మందికి రూ.7.71లక్షలు, ఏడుగురు లాటరీ వాళ్లకు రూ.60లక్షలు బాకీ ఉన్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఈ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదేమి విడ్డూరం సారూ..!

- గతంలో పనిచేసిన అధికారికి విచారణ బాధ్యతలు

పుత్తూరు అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో విడ్డూరం నెలకొంది. 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని సమగ్రస్థాయిలో విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే 2019 నుంచి నాలుగు సంవత్సరాల పాటు టౌన్ ప్లానింగ్ అధికారిగా సుభప్రద పనిచేశారు. కాగా, నేడు పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అక్రమాల విచారణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఈ పరిణామంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. దీనివల్ల విచారణలో పారదర్శకత ఎంత మాత్రం ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య అరగంట ఆలస్యంగా నడిచిన రైళ్లు

రేణిగుంట, మార్చ్ 4, (ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళవారం రాత్రి అరగంట ఆలస్యంగా నడిచాయి. వివరాల్లోకి వెళితే... మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన రాయలసీమ, కాచిగూడ, ఎగ్మోర్, వెంకట్రాది ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈక్రమంలో మాముండూరు వద్ద రేణిగుంటకు వస్తున్న గూడ్స్ రైలు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇంజన్ పైలట్ గూడ్స్‌ను ఆపేశారు. దీంతో కడప రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను ఆపేశారు. ఇక్కడి నుంచి వెళ్లాల్సిన రైళ్లను పంపించారు. దీంతో ఈ రూటులో వెళ్లాల్సిన రైళ్లు అరగంట ఆలస్యంగా నడిచాయి.

నా వ్యక్తిగత సమస్యను రాజకీయం చేస్తున్నారు

- రెండు పార్టీల నేతలపై లక్ష్మీరెడ్డి విమర్శ



తిరుపతి(వైద్యం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'నా ఆర్థిక లావాదేవీల సమస్యకోసం నేను మీడియా ముందుకు వచ్చా. ఆ సమస్యను ఆసరాగా తీసుకొని అధికార, ప్రతిపక్ష నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో తప్పుగా ట్రోల్స్ చేస్తున్నారు' అని ఇటీవల కిరణ్‌రాయల్‌పై ఆరోపణలు చేసిన లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను నా ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన ఒక్క వీడియో మాత్రమే విడుదల చేశా. అది కాకుండా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న మిగతా వీడియోలు, ఫొటోలన్నీ కొందరు రాజకీయ లబ్ధి కోసం పోస్టు చేశారు. అందులో నా ప్రమేయం లేదు. కిరణ్‌రాయల్ సొంత పార్టీకి చెందిన నేతలే ఏడాది కిందట నా వద్దకొచ్చి న్యాయం చేస్తామని చెప్పి ఆధారాలు తీసుకెళ్లారు. ప్రతిపక్ష పార్టీ నేతలతో కలిసి ఇప్పుడు వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో జనసేనకు చెందిన జిల్లా నేత ప్రమేయమే ఎక్కువగా ఉంది. ఇలా నా వ్యక్తిగత సమస్యను రాజకీయ లబ్ధికోసం రెండు పార్టీల నేతలు నాకు తెలియకుండా, నా విషయాన్ని తప్పుగా ప్రచారం చేశారు. దీనిపై ఇప్పటికే నేను ఆ నేతలపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశా. నాకే పార్టీతోనూ.. నేతలతోనూ సంబంధం లేదు. నా సమస్య పరిష్కారానికే పోరాటం చేశా. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను చూసి నా బిడ్డలు ఇంతటితో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టమని కోరడంతో, దీనిని ఇంతటితో ముగిద్దామనుకుంటున్నా' అని ఆమె పేర్కొన్నారు. జనసేన పార్టీలోని ఆ జిల్లా నేత ఎవరని మీడియా ప్రతినిధులు అడగ్గా.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అన్నీ తెలిపానన్నారు. ఇప్పటి వరకు ఏ పార్టీ నేతలూ తనకు మద్దతుగా లేరని, ఎవరి నుంచీ బెదిరింపులు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఒకవేళ ఉంటే జనసేన పార్టీకి చెందిన జిల్లా నేత నుంచి ప్రాణహాని ఉండొచ్చని, ఈ విషయాన్ని పోలీసులకూ చెప్పానన్నారు. వాళ్లు తనకు న్యాయం చేస్తారని బదులిచ్చారు.

న్యాయం కావాలంటూ..

- వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన

తిరుపతిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): న్యాయ దేవత వేషధారిణికి ఒక చేతిలో భారత రాజ్యాంగం. మరో చేతిలో త్రాసు. అందులో ఒక వైపు వెటర్నేరియన్ల కష్టం, ప్రొఫెషన్ ప్రాముఖ్యత బరువైన బ్లాకులుగా ఉంచారు. మరోవైపు తక్కువ మొత్తంలో స్టైఫండ్‌ని చిన్నపెట్టిలో ఉంచారు. విద్యార్థుల కష్టాల బరువు ఎక్కువగా ఉండటంతో త్రాసు సమతుల్యం కాదని.. న్యాయం ఎటువైపుకి ఒరగాలి.. అంటూ వెటర్నరీ విద్యార్థులు మంగళవారం వినూత్న తరహాలో నిరసన తెలిపారు. వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ నెల రోజులుగా వీరు చేపట్టిన నిరవధిక సమ్మె.. మంగళవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు వద్ద ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులు చేతపట్టారు. తమ హక్కులకోసం ప్రభుత్వాన్ని, వర్సిటీ అధికారులను వేడుకుంటున్నా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య విద్యార్థుల వద్దకు వచ్చి వెంటనే సమ్మెని విరమించి తరగతులకు హాజరుకావాలని, లేకుంటే బుధవారం నుంచి హాస్టళ్ల మెస్‌లని మూసివేస్తామన్నారు. ఆ మరుసటిరోజున హాస్టళ్లు ఖాళీచేయాల్సి ఉంటుందని వివరించారు. హాస్టళ్లను మూసినా సమ్మె కొనసాగిస్తామని విద్యార్థులు అంటున్నారు.

నేటినుంచి మెస్ సేవలు నిలిపివేత

నెల రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మెబాటలో ఉన్నందున్న బుధవారం నుంచి హాస్టళ్లకి అనుబంధంగా ఉన్న మెస్‌సేవలను నిలుపుదల చేస్తూ వర్సిటీ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈమేరకు విద్యార్థులకు మెస్‌సేవలు ఉండవని, అలాగే గురువారానికి హాస్టళ్లని పూర్తి స్థాయిలో ఖాళీ చేయాల్సిఉందని నోటీసులో పేర్కొన్నారు.



ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం

వర్సిటీలు, కాలేజీల బంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉమ్మడి పీజీసెట్ రద్దు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ చేపట్టారు. పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే వెసులుబాటు యూనివర్సిటీలకే అప్పగించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వీరు బంద్‌కు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలు, కాలేజీలను విద్యార్థి నేతలు కలియతిరుగుతూ బంద్ పర్యవేక్షించారు. ఎస్వీయూనివర్సిటీలో విద్యార్థి సంఘాలన్నీ బంద్ సందర్భంగా ర్యాలీ చేపట్టాయి. యూనివర్సిటీలోనే బైఠాయించి నిరసన తెలిపాయి. ఉమ్మడి పీజీసెట్ వల్ల రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఇప్పటికే పీజీ ప్రవేశాలు భారీగా తగ్గాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో యూనివర్సిటీలే మూత పడే ప్రమాదం ఉందన్నారు. పీజీ అడ్మిషన్లు యూనివర్సిటీలే నిర్వహించుకునేటప్పుడు యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా అనుసరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, చలపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అక్బర్, ఎన్ఎస్‌యూఐ నేత జెన్నే మల్లికార్జున, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



బంద్‌లో పాల్గొన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు

తిరుమలలో మెరుగైన సేవలపై నివేదిక



ఈవో శ్యామలరావుతో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత బాధ్యతగా, మెరుగ్గా, సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్ర నివేదికను రూపొందించింది. బృందం సభ్యులు మంగళవారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును కలిసి నివేదికను అందజేశారు. దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణాపరమైన సూచనలను, సలహాలను తీసుకుని అమలు చేయాలనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వీరు గతనెల 28 నుంచి ఐదురోజుల పాటు తిరుమలలో పరిశీలించి నివేదికను తయారుచేశారు. సభ్యులు రఘుపాత్రుని లక్ష్మణరావు, చుండూరి సురేంద్ర, కొమరగిరి శ్యాంప్రసాద్, విశ్వనాథరెడ్డిలు పలు సూచనలతో ఈవోకు నివేదిక సమర్పించారు. వీరిని శ్యామలరావు అభినందించారు. నివేదికలోని అంశాలు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతాయని ఈవో అభిప్రాయపడ్డారు.

క్యానర్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జీవన శైలిలో వచ్చిన మార్పుల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. మనం తీసుకునే ఆహారం రసాయన పదార్థాలతో నిండిఉండడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. జంక్ ఫుడ్, పొగాకు వినియోగం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, నిల్వ చేసిన ఆహార పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్‌కు కారణమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా.. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నివారణ సులభతరంగా ఉంటుందన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది కన్యాకుమారి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై వేధింపులు ఆపాలి



మోపూరు రోడ్డులో గిరిజన సంఘం నేతల నిరసన ర్యాలీ

డక్కిలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతమంది అటవీ అధికారులు గిరిజనులను వేధింపులకు గురిచేస్తున్నారని రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. అటవీశాఖ అధికారుల వేధింపులకు నిరసనగా మంగళవారం సాయంత్రం గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీ భూమిని గిరిజనులు ఆక్రమించడంతో అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. గిరిజన సంఘం నాయకులతో కలిసి స్థానికులు మరోమారు అటవీ భూములను ఆక్రమిస్తారని సమాచారం అందడంతో పోలీసులు, అటవీశాఖ అధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గిరిజన సంఘ నాయకులు మోపూరు మీదుగా ఆల్తూరుపాడులో ఓ గిరిజన కుటుంబాన్ని పరామర్శించేందుకు ర్యాలీగా వెలుతుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఈ పందర్భంగా అటవీ అధికారులకు, గిరిజన సంఘ నేతలకు వాద్వాదం చోటు చేసుకొంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కోర్టులో ఉన్న భూమి మీదుగా ర్యాలీ నిర్వహించేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గిరిజన సంఘాల నాయకులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల పట్ల డీఆర్వో ప్రతాప్‌రెడ్డి కక్షపూరిత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. ర్యాలీలో జిల్లా రైతు కూలీ సంఘం నాయకుడు రమణయ్య, సీపీఎం నాయకుడు చెంగయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి చలపతి, భాస్కర్, చెంబేటి ఉష, మురళి, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడుపేట తుమ్మూరు ఎల్‌ఏ సాగరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వారికి కనీసం వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, సీఐటీయూ నాయకులు శివకవి, ముకుందా, రోజా, అప్పన్న, బాగ్యమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పెళ్లకూరు నేతలు



పల్లా శ్రీనివాస రావుతో టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును పెళ్లకూరు మండలానికి చెందిన నేతలు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్ఠతకు పనిచేయాలని పల్లా సూచించారు. శ్రీనివాస రావును కలిసిన వారిలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మదన్ మోహన్ నాయుడు, మాడుపూరు మురళీనాయుడు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు కోసం అందిన దరఖాస్తులను మున్సిపల్ కమిషనరు షేక్ ఫజులుల్లా మంగళవారం పరిశీలించారు. పట్టణానికి 50 యూనిట్లు కేటాయించగా 25 వార్డుల నుంచి 558 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు 15 యూనిట్లు, కెనరా బ్యాంకు-10, ఇండియన్ బ్యాంకు 10, యూనియన్ బ్యాంకు-1 నుంచి 7 యూనిట్లు, యూనియన్ బ్యాంకు-2 నుంచి 8 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. దరఖాస్తుదారుల అర్హతలు, సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తామని చెప్పారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు చైతన్యంతో బాల్య వివాహాలను నిర్మూలిద్దామని అంగన్‌వాడీ సూపర్ వైజర్ కవిత పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులకు ఆరోగ్యం, పిల్లల పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం పౌష్టికాహార ఆవశ్యకత, బాల్యవివాహాల నిర్మూలనపై చిట్టేడులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సునీత, సుధామాధవి, సునీత, మణెమ్మ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో మార్చి 31 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీఐ మురళీకృష్ణ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆంక్షలు విధించామన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

ఆటో బోల్తా

నాయుడుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటో ఉన్న విద్యార్థులకు, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

సాంకేతిక సమస్యతో ఆగిన మెము రైలు

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న మెము రైలు సాంకేతిక సమస్యతో మండలంలోని ఓడూరు రైల్వేస్టేషన్‌లో మంగళవారం రెండుగంటల పాటు నిలిచిపోయింది. స్థానికుల వివరాల మేరకు... చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న మెము రైలు ఓడూరు రైల్వేస్టేషన్‌కు ఉదయం 9గంటలకు చేరుకుంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉదయం 11గంటల వరకు ఆపేశారు. మరమ్మతులు చేసిన అనంతరం చెన్నై బయలుదేరింది. ప్రయాణికులను పట్నా రైలులో నెల్లూరుకు పంపారు.

వాడవాడలా సిమెంటు రోడ్లు

రూ.2.21 కోట్లతో 6.4 కిలో మీటర్ల మేర నిర్మాణం

పెళ్లకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెళ్లకూరు మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సహకారంతో మండలంలోని 24 పంచాయతీల్లో 6.4 కిలో మీటర్ల పొడవున సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.2.21 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో అనకవోలు రూ.5 లక్షలు, బంగారంపేట రూ.20లక్షలు, చావాలి రూ.26లక్షలు, చెంబేడు రూ.19లక్షలు, చిల్లకూరు రూ.7 లక్షలు, చింతపూడి రూ.9 లక్షలు, కానూరు రూ.15లక్షలు, కలవకూరు రూ.10లక్షలు, ముమ్మారెడ్డిగుంట రూ.4లక్షలు, నందిమాల రూ.5లక్షలు, నందిమాల రూ. 9లక్షలు, పెళ్లకూరు రూ.8 లక్షలు, పునబాక రూ.9 లక్షలు, కొత్తూరు రూ.8 లక్షలు, శిరసనంబేడు రూ.8 లక్షలు, తాళ్వాయిపాడు రూ 5 లక్షలు, పెన్నేపల్లి రూ.5లక్షలు, జీలపాటూరు రూ.18 లక్షలు, చెన్నప్ప నాయుడుపేట రూ.8లక్షలు, పుల్లూరు రూ.8లక్షలు, అర్దమాల గ్రామానికి రూ.15లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులను సిమెంటు రోడ్లుగా మార్చుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు బురదమయంగా ఉన్న మట్టి రోడ్లలో తిరగలేక ఇబ్బందులు పడ్డామని, కూటమి ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నెలబల్లిలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఈఈ రమణయ్య

అదేవిధంగా రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు సొసైటీ గోడౌన్‌ల వద్దకు సిమెంటు రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.02 కోట్లు మంజూరు చేసింది. ఇందులో చెంబేడు గోడౌన్‌కు రూ.64.80లక్షలు, చిల్లకూరు గోడౌన్‌కు రూ.1.20లక్షలు, నెలబల్లి గోడౌన్‌కు రూ.21లక్షలు మంజూరు చేసింది. మండలంలో ఇప్పటి వరకు 5.9 కిలోమీటర్లకు పైగా సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామని, మిగిలినవి త్వరలో పూర్తవుతాయని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేష్ తెలిపారు.

ఉపాధిలో అవకతవకలపై చర్యలు

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

బాలాయపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.14.70 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై గత ఇరవై రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆరుగురు డీఆర్పీలు ఆరు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించారు. మంగ ళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలను వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన పిగిలాం, మన్నూరు పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. నిడిగల్లు, పిగిలాం, పెరిమిడి, వెంగమాంబపురం, బైరవరం, కడగుంట, కాలగంద, మన్నూరు, కయ్యూరు, జయంపు గ్రామాల పనుల్లో అక్రమాలు జరగడంతో రూ.245298 రికవరీకి ఆదేశించారు. అలాగే రూ.198200 జరిమానా విధించారు. కార్యక్ర మంలో ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీవో వినీల్‌కుమార్, ఏపీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుచేస్తే శిక్ష అనుభవించాల్సిందే

వెంకటగిరి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో తప్పుచేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని పీడీ శ్రీనివాసప్రసాద్



ఉపాధి పనుల్లో అక్రమాలను వెల్లడిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

అన్నారు. మంగళ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15 ఆర్థిక సంఘం నిధుల ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 20పంచాయతీల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక మేటును సస్పెండ్ చేసి సొమ్ము వికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

వాకాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 5నుంచి 14వ తేదీ వరకు ఉపాధి తనిఖీ గ్రామసభలు ఆయా సచివాలయాల్లో జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

మూడు సవర్ల బంగారు సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు గ్రామంలో మహిళ మెడలో నుంచి మూడు సవర్ల బంగారు సరుడు గుర్తు తెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లాడు. నాయుడుపేట పట్టణంలోని పిండివారి తోటలో నివాసముంటున్న సుభాషిణి పండ్లూరు గ్రామంలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు బయలుదేరింది. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళుతుండగా మోటరు సైకిల్ వచ్చిన గుర్తుతెలియని దుండగుడు సుభాషిణి మెడలో నుంచి మూడు సవర్ల బంగారు సరుడు లాక్కొని పారారయ్యాడు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఏటీఎం కార్డు మార్చి రూ.10వేల అపహరణ

నాయుడుపేటటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు మార్చి రూ.10వేలు నగదు అపహరించిన ఘటన పట్టణంలోని బజారువీధిలో చోటు చేసుకుంది. పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ మంగళవారం ఉదయం నాయుడుపేట పట్టణానికి చేరుకుని బజారు వీధిలో ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఓ యువకుడు నగదు డ్రా చేసి ఇస్తానని వెంకటసుబ్బమ్మ దగ్గర నుంచి ఏటీఎం కార్డును తీసుకున్నాడు. నగదు డ్రా కాలేదంటూ వేరే ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. కొంత సేపటి తరవాత ఆ మహిళ సెల్‌ఫోన్‌కు రూ.10వేలు నగదు డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. ఆమె వద్దనున్న ఏటీఎం కార్డును పరిశీలించగా నకిలీదని తెలియడంతో లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి



ఎంపీ గురుమూర్తిని కలిసిన రైతులు

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలో సాగరమాల రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించేలా చూడాలంటూ రైతులు మంగళవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు 13 అడుగులకు పైగా ఎత్తులో నిర్మిస్తున్నారని, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇరు వైపులా ఉన్న పంట పొలాలకు దారి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ బ్రిడ్జిల నుంచి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తే తమ పంట పొలాలకు, ఆయా ప్రాంతాల గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. ఎంపీని కలిసిన వారిలో రైతులు జలదంకి వెంకట కృష్ణారెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, విజయలురెడ్డి, సునీల్ ఉన్నారు.

జీవవైవిధ్యంపై అవగాహన కలిగివుండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలితకుమారి

గూడూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్యంపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ లలితకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవ వైవిధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యం ప్రకృతి సమతుల్యానికి దోహదపడుతుందన్నారు. వణ్యప్రాణులకు పరిరక్షించుకోవడం, కనుమరుగైపోతున్న జీవజాతులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, విజయ మహేష్, పీర కుమార్, శ్రీధర్‌శర్మ, కిరణ్మయి, నారాయణరాజు, హిమబిందు, రవిరాజు, శైలజ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టవర్ క్లాక్‌సెంటర్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలన్నారు. ఆటోలకు ఈ-చలానా నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. పెంచిన రోడ్ ట్యాక్స్ తగ్గించాలన్నారు. మోటర్ రంగంలోని కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నారాయణ, ప్రభాకర్, శశికుమార్, రమేష్, కృష్ణ, రాజా, ముని, అంకయ్య, అరవింద్, దశయ్య, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేసేలా అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో గూడూరు నియోజకవర్గ నాయకులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తిరుపతి ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో మోహన్, శేఖర్, వెంకటరమణ, కార్తీక్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో గూడూరు జనసేన నాయకులు

జాతరలో దుకాణాలకు వేలం

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతర సందర్భంగా దుకాణాల నిర్వహణకు మంగళవారం దేవాదాయశాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. భక్తుల తలనీలాలు సేకరణకు రూ.4,01,000, గుడిపై భక్తులు వేసే మొక్కులకు రూ.27,000, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు రూ.19,000, సిద్దవరం వైపు పార్కింగ్‌కు రూ.22,000, వేయి కళ్ల కుండలు విక్రయించుకునే దుకాణాల వేలం ద్వారా రూ.3,01,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

కోట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం గ్రామానికి చెందిన ప్రవళిక తన భర్త శివయ్య, ఆయన కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు.

ఐటీఐలో తరగతి గదుల ఆధునికీకరణ



గదులను ప్రారంభిస్తున్న శ్రీసిటీ ఐమాప్ ప్రతినిధులు

తడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ సెజ్‌లోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ స్థానిక ఐటీఐలో తరగతి గదులను ఆధునికీకరించింది. పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.7.5 వెచ్చించి తరగతి గదుల మరమ్మతులు, డెస్కులు, బల్లలు ఏర్పాటు చేశారు. వీటిని శ్రీసిటీ డైరెక్టర్ నిరీష సన్నారెడ్డి, ఐమాప్ ఎండీ టాయిజో ఇవామీ లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవదానం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని సీడీపీవో మెహబూబి అన్నారు. మంగళ వారం మండలంలోని పారిచెర్లవారిపాళెం ఎస్టీ కాలనీలోని అంగన్ వాడీ కేంద్రంలో బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఓజిలిలో బీసీ రుణ మేళా

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ రుణ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఓజిలి, ఆరిమేనిపాడు యూనియన్ బ్యాంకు, కురుగొండ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు రుణమేళా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

7 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 7నుంచి 13 బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శెల్వం తెలిపారు. 7న అంకురార్పణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు వారంలో రోజులపాటు వైభవంగా జరుగుతాయన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పనిచేసే మహిళా వైద్య సిబ్బందికి వైద్యాధికారి సత్యవేటి రమణయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు ప్రధానం చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 1వ నెంబరు ప్లాట్‌ఫారం వద్దనున్న బుకింగ్ కౌంటర్ సమీపంలో బ్యాగు తల కిందపెట్టుకొని మృతి చెంది ఉన్నాడు. నిద్రలో గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ చెన్నకేశవులు చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు రోటరీ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీక్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రోటరీ క్లబ్ సేవలను విస్తరిస్తున్నామని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ సాధు గోపాలకృష్ణ తెలిపారు. కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ నెల్లూరు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సంస్థలు ఉన్న ఏకైక సంస్థ రోటరీక్లబ్ అన్నారు. రూ.5 వేల కోట్లతో పోలియో నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొవిడ్ సమయంలో ఈ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. సమావేశంలో రోటరీక్లబ్ ప్రతినిధులు పసుపులేని కిషోర్, మధుయాదవ్ పాల్గొన్నారు.

దళిత, గిరిజన కాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు

కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దళిత, గిరిజన కాలనీలకు తాగునీరు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో గోపి తెలిపారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం దళితవాడలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లను ఆయన పరిశీలించారు. సాగరమాల రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు ఇటీవల ధ్వంసమయ్యాయి. దీంతో కాలనీలకు తాగునీరు ఇబ్బందికరంగా మారింది. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాల మేరకు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ వెళ్లి తాగునీటి ట్యాంకులు, పైపులైన్లను పరిశీలించారు. తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించకుంటే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఇతర వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా సరైన ధృవీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు గ్రామానికి చెందిన విద్యార్థినని రేణుకకు చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రేణుక తల్లిదండ్రులు ఇద్దరూ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో విద్యార్థినికి ట్రస్ట్ తరపున రూ.10వేలు నగదు అందించినట్లు ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రరెడ్డి, బాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో సమాచారం కరువు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్దనున్న కంట్రోల్ పాయింట్‌లో ప్రయాణికులకు సమాచారం కరువైంది. ప్రయాణికులకు నిరంతరం సమాచారం అందించేందుకు కంట్రోల్ పాయింట్‌లో చేసి సిబ్బందిని నియమించి మొబైల్ ఫోన్ అందుబాటులో ఉంచారు. అయితే కంట్రోల్ పాయింట్‌లోని 8500122389 నెంబరుకు ఫోన్‌చేస్తే ఎవరూ తీయడం లేదని, ఆర్టీసీ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని ప్రయాణికులు చెబుతున్నారు.